



# దీపావళి కానుక

- ఉచిత గ్యాసు సిలిండర్లతో ప్రజలకు భారీ ఊరట
- గడిచిన ఐదేళ్లలో ప్రజలపై మోయలేని భారం
- భారం కేంద్రానిదైనా రాష్ట్ర ప్రభుత్వ హామీతో ఊరట
- భారాన్ని తగ్గించడం కోసం ఏటా 3 సిలిండర్ల ఉచితం
- 3 జిల్లాల్లో దాదాపు 17 లక్షల మందికి ప్రయోజనం
- ఒక్కో కనెక్షన్‌పై ఏడాదికి రూ. 2500 లబ్ధి



గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తమను గెలిపిస్తే 'సూపర్ సిక్స్' పథకంలో భాగంగా ఏటా 3 సిలిండర్లు ఉచితంగా అందిస్తానని అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రజలకు హామీ యిచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీ నెరవేర నుంది. నాడు 'దీపం' పథకం ద్వారా పేదలకు వంట గ్యాసు కనెక్షన్లు ఇచ్చి వారి ఇళ్లలో వెలుగులు నింపిన టీడీపీ ప్రభుత్వం, ఈ దీపావళికి ఉచిత సిలిండర్లను ప్రజలకు అందించనుంది. ఈ పథకం అమలులోకి రానుండడంతో పేదల ఇళ్లలో 'దీపాల' వెలుగులు రెట్టింపు కానున్నాయి. దీపావళి రోజునే ఈ పథకం ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. దీని అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాల రూపకల్పనకు కసరత్తు చేస్తోంది. ఈ పథకం అమలుతో ప్రతి నాలుగు నెలలకు ఒక ఉచిత సిలిండర్ పొందవచ్చు.

**● విధివిధానాలపై కసరత్తు**

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 19 లక్షల వంట గ్యాసు కనెక్షన్లు ఉన్నాయి. గుంటూరు జిల్లాలోనే 7 లక్షల కనెక్షన్లు వుండగా, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 12లక్షల గ్యాసు కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో ఎంతమంది ఈ పథకానికి అర్హులవుతారు. ఎలాంటి విధి విధానాలు రూపొందిస్తే ఎక్కువ మందికి లబ్ధి చేకూరుతుంది అన్న అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో విధిగా నివాసం వుండేవారే ఈ పథకానికి అర్హులవుతారు. ఈ పథకం పొందాలంటే గ్యాస్ కనెక్షన్ వుండి, ఆర్థికంగా వెనకబడినవారై ఉండాలి. బీపీఎల్ కుటుంబాలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రధానంగా తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటారని అధికారులు సూత్రప్రాయంగా చెబుతున్నారు. అయితే, దీనికి సంబంధించి జిల్లా అధికారులకు సమాచారం రావాల్సి వుంది. పూర్తిస్థాయి సమాచారం వస్తే ఈ పథకానికి ఎంత మంది అర్హులు అవుతారనే విషయంపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 17లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటే కనుక ఉమ్మడి గుంటూరు జిల్లాలో 17లక్షల మందికి ప్రభుత్వం ఉచితంగా సిలిండర్లు ఇవ్వాల్సి ఉంటుంది.

**● సిలిండర్లు పొందడం ఇలా..**

రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అక్టోబరు 31వ తేదీన ప్రారంభించనుంది. ఈ నెల 24వ తేదీ నుంచి గ్యాసు బుకింగ్‌లు ప్రారంభించనున్నారు. బుక్ చేసుకున్న వినియోగదారులు సిలిండర్ డెలివరీ సమయంలో మాత్రం సిలిండర్ ధర చెల్లించాల్సి వుంటుంది. ప్రస్తుతం 14.2 కిలోల వంట గ్యాసు సిలిండర్ ధర రూ. 876 వుంది. ఈ మొత్తం వినియోగదారుడు చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ రూ. 25 వినియోగదారుల బ్యాంకు ఖాతాలో జమవుతాయి. పోగా మిగిలిన రూ.851ను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి రాయితీ కింద ఇస్తుంది.

**● గడచిన ఐదేళ్లలో మోయలేని భారం**

గృహావసరాల కోసం వినియోగించుకునే వంట గ్యాసు భారం ప్రజలపై మోయలేనంతగా పెరిగింది. గడిచిన పదేళ్లలో ఈ భారం 150 శాతానికి మించి పెరిగింది. గడిచిన ఐదేళ్లలోనే ఈ భారం 100 శాతం పెరిగింది. 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు వంట గ్యాసు సిలిండర్ ధర రూ. 436 ఉండగా, అది 2019 నాటికి రూ.706కు పెరగగా, 2021 నాటికి రూ.949కు, 2022 నాటికి రూ. 1,150 నుంచి రూ.1,200 వరకూ వెళ్లడంతో ప్రజలు తారెత్తిపోయారు. వంట గ్యాసు మంటలు దావానలంలా అలముకోవడంతో కేంద్రం దిగివచ్చి, గ్యాసు భారాన్ని కొంత మేర తగ్గించింది. కానీ, గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తగ్గించకపోవడంతో, వంట గ్యాసు ధర రూ. 876గా ఉంది. అయితే, వంట గ్యాసు భారాన్ని మరింత తగ్గించేందుకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్‌లో భాగంగా ఏటా 3 సిలిండర్లు ఉచితంగా అందిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన నాలుగు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. మొత్తంగా ప్రతి ఏటా ఒక్కో కనెక్షన్‌పై రూ.2,500 లబ్ధి వినియోగదారులకు దక్కనుంది.

6



# ఊపిరి పీల్చుకోండి

వాయు, శబ్ద కాలుష్యాలు పెరిగిపోతున్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే గుంటూరువాసులు కొంతమేర వాయు కాలుష్యం నుంచి ఉపశమనం పొందుతున్నారు. గతంతో పోలిస్తే వాయు కాలుష్యం కొంత తగ్గిందని కాలుష్య నియంత్రణ అధికారులు ప్రకటించారు. దుమ్ము, ధూళి, పొగ, దుర్వాసన, హారన్ల మోతలు, చెవులు చిల్లులు పడేలా శబ్దాలు.. ఇళ్లలో నుంచి బయటకు వచ్చి రోడ్డెక్కిన ప్రతిఒక్కరికీ ఎదురయ్యే పరిణామాలు. వాయు, శబ్ద కాలుష్యాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గ్రామాలు, పట్టణాలతో పోలిస్తే నగర జీవి కాలుష్యాల కాటుకు బలవుతున్నారు. అయితే దేశంలో అధికంగా కాలుష్యం నమోదవుతున్న 132 నగరాలున్న జాబితా నుంచి గుంటూరు ఇప్పుడిప్పుడే బయటపడుతుంది. 2021 నుంచి 2024 ఆగస్టు వరకు వాయు కాలుష్యాన్ని చూస్తే 0.9 శాతం ఎమ్‌జీక్యూక్యూ తగ్గింది. ఇది ప్రస్తుత పరిణామాలతో పోల్చుకుంటే మెరుగేనని అధికారులు చెప్తున్నారు. వాయు కాలుష్యాన్ని ఇంకా తగ్గించి, శబ్ద కాలుష్య నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు మూడు జిల్లాల పరిధిలో ఒక్క గుంటూరులో మినహా మిగిలిన మున్సిపల్ కేంద్రాల్లో కానీ, జిల్లా కేంద్రాలైన బాపట్ల, నరసరావుపేటల్లో కాలుష్య నియంత్రణపై అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలున్నాయి. అవగాహనా కార్యక్రమాలతోనే సరిపెడుతున్నారని తమ ప్రాంతాల్లో కూడా కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆయా పట్టణ ప్రజలు కోరుతున్నారు.

- గుంటూరులో కాలుష్యం కట్టడి
- సాధారణ స్థాయిలోనే శాతాల నమోదు
- మరింతగా తగ్గాలని కోరుకుంటున్న ప్రజలు
- అధిక కాలుష్య నగరాల జాబితా నుంచి బయటకు
- మిగిలిన పట్టణ ప్రాంతాల్లో అందుబాటులో లేని యంత్రాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలతో సరి



గుంటూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద కాలుష్య నమోదు యంత్రం

గుంటూరులోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద వాయుకాలుష్య నమోదుయంత్రాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో నమోదైన శాతాలు..

| ఏడాది శాతం | (ఎమ్‌జీక్యూక్యూ) |
| --- | --- |
| 2021 | 61 |
| 2022 | 60.9 |
| 2023 | 60.3 |
| 2024(ఆగస్టుకి) | 60.4 |



గుంటూరులో త్వరలో ఏర్పాటుకు సిద్ధమైన కాలుష్యం లెక్కించే యంత్రం

- స్థానిక సంస్థలకు నిలిచిన నిధులు
- తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం
- మూడు మున్సిపాల్టీలు, 69 పంచాయతీలకు ఆగిన నిధులు

# ఎన్నికలు జరగలేదని.. ఝలక్



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం స్థానికసంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మూడు మున్సిపాల్టీలు, 69 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. 15వ ఆర్థికసంఘం నిధులు నిలివేసింది. నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు మున్సిపాల్టీలు రూ.8.91కోట్లు, 69 పంచాయతీలు సుమారు 3.5కోట్లు నిధులను చేజార్చుకున్నాయి. జనాభా ప్రాతిపదికన ఆర్థికసంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం స్థానికసంస్థలకు విడుదల చేస్తుంటుంది. పాలకవర్గాలు ఉంటేనే నిధులు విడుదల చేయాలన్న నిబంధన ఉంది. ఫలితంగా పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలైన నరసరావుపేట,

(మిగతా 8వ పేజీలో...)



అంజనాపురం కాలనీలో బాధితులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ సెకండరి హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరి డాక్టర్ సిరి

# దాచేపల్లిలో డయేరియా

- ఇద్దరు మృతి.. మరో 14 మందికి అస్వస్థత
- బాధితులకు ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్, ఎస్పీ పరామర్శ



మృతిచెందిన బండారు చినవీరయ్య (ఫైల్‌ఫొటో)

దాచేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వాంతులు, విరేచనాలతో దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీవాసులు అస్వస్థతకు గురయ్యారు. ఈ నెల 22నుంచి కాలనీలో వాంతులు, విరేచనాలు ప్రబలాయి. రెండు రోజుల్లో ఇద్దరు మృతి చెందారు. బుధవారం డిగ్రీ విద్యార్థి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు(21) మృతి చెందగా గురువారం బండారు చినవీరయ్య (62) అనే వృద్ధుడు మృతి చెందాడు. మరో 14 మంది వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్నారు. దీంతో గురువారం అధికారులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో రవి తదితరులు డయేరియా ప్రాంతాల్లో పర్యటించారు. మృతుల కుటుంబాలను, బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు. ఎవరూ భయ పడవద్దని, అన్నివిధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తాగునీటి అవసరాల కోసం ఉపయోగించే బోరు నీరు రంగు, రుచి, వాసన మారిందని కాలనీవాసులు కలెక్టర్‌కు, ఎమ్మెల్యే కు తెలిపారు. దీంతో బోరును కలెక్టర్, ఎస్పీతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించి దానిని నిలిపివేసి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి అస్వస్థతకు గురైన వారి వివరాలు సేకరించి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి సేవలు అందిస్తుంది. పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైయిన్లను శుభ్రపరిచి కాలనీలోని వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. చల్లా దుర్గారావు, తమ్మిశెట్టి రమణ, దేవళ్ల శాంతమ్మ, దేవళ్ల సైదులు, తమ్మిశెట్టి కోటేశ్వరరావు, బత్తుల రమేష్, తమ్మిశెట్టి కార్తీక, మరికొందరు దాచేపల్లి, పిడుగు రాళ్ల, నరసరావుపేటలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గుళ్ల క్వారీ కార్మికుడుగా పనిచేసే చినవీరయ్య వాంతులు, విరేచనాలకు గురై మృతి చెందడంతో కాలనీవాసుల్లో మరింత ఆందోళన చెందుతున్నారు.

**రాపిడ్ శాండ్ ఫిల్టర్ ఏర్పాటు : ఎమ్మెల్యే యరపతినేని**

డయేరియాతో ఇద్దరు చనిపోవడం బాధాకరమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. అంజనాపురం కాలనీలోని వడ్డెర కార్మికుల కోసం రూ.25 లక్షలతో రాపిడ్ శాండ్ ఫిల్టర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డయేరియా నియంత్రణలోకి వచ్చేంత వరకు వైద్యసేవలు, పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నారాయణపురంలోని కృష్ణ హాస్పిటల్‌లో రోగులను పరిశీలించి డాక్టర్ శ్రీరామనేని కృష్ణప్రసాద్‌తో మాట్లాడి రోగుల ఆరోగ్యం గురించి ఎమ్మెల్యే, కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, వైద్యాధికారి డాక్టర్ అమూల్య, తహసీల్దార్ వై కుటుంబరావు, కమిషనర్ అప్పారావు తదితరులు ఉన్నారు.



అంజనాపురం కాలనీలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



మిర్చియార్డులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ, సీఐలు

# మిర్చియార్డులో మళ్లీ విజిలెన్స్ తనిఖీలు

- గేట్ ఎంట్రీ మొదలు ఎగ్జిట్ వరకు పరిశీలన
- స్వయంగా రంగంలోకి ఎస్పీ.. సిబ్బందికి ముచ్చమటలు

8

# విభజిత జిల్లాలకు.. నూతన డీఈవోలు

- గుంటూరుకు సీవీ రేణుక, పల్నాడుకు చంద్రకళ
- బాపట్ల డీఈవోగా ఎస్ పురుషోత్తం... డైట్ ప్రిన్సిపాల్ బదిలీ
- గుంటూరు ప్రస్తుత డీఈవో శైలజకు పోస్టింగ్ నిల్
- కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి, గొట్టిపాటి రవికుమార్
- పువ్వాడ వద్ద గుండ్లకమ్మపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

నూజెండ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. నూజెండ్ల మండలం పువ్వాడ గ్రామం వద్ద గుండ్లకమ్మ నదిపై రూ.20.15 కోట్లతో నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులతో కలిసి గురువారం మంత్రి గొట్టిపాటి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ శిలాఫలకాల్ని ఆవిష్కరించి, మొక్కలను నాటారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ములకలూరు గ్రామంలో సీసీ రోడ్లు, మినీ గోకులాలకు శంకుస్థాపన చేశారు. పువ్వాడ గ్రామంలో జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో ఇంటింటికి తాగునీటి కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. 175 నియోజకవర్గాల్లో సక్రమంగా జరుగుతూ ప్రజాదరణ పొందిన అన్న క్యాంటీన్లపై దురుద్దేశంతో జగన్ నిలిపివేయగా తాము పునః ప్రారంభించామన్నారు. వీటి ద్వారా పేదల ఆకలి బాధలు తీరుస్తున్నామన్నారు. త్వరలోనే మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకువచ్చేందుకు మంత్రి లోకేశ్ అమెరికా పర్యటనకు వెళ్తున్నారన్నారు. పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన వ్యక్తి భార్యకు నెల రోజుల్లోనే పెన్షన్‌ను ఇచ్చేవిధంగా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. అర్హులందరికీ త్వరలో పెన్షన్లను అందజేస్తామన్నారు. గ్రామంలో పాడైన విద్యుత్ స్తంభాలు, వైర్లు, లోఓల్టేజీ ఇబ్బందులపై గ్రామస్తుల ఫిర్యాదుతో మంత్రి అధికారులను అక్కడికక్కడే ఆయా సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. వినుకొండకి 132, 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ లెనిన్‌కుమార్, జనసేన ఉమ్మడి జిల్లా కన్వీనర్ నిశ్శంకరావు శ్రీనివాసరావు, జడ్పీటీసీ జెడ్డా సుబ్బులురామయ్య తదితరులు పాల్గన్నారు.



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

# డీఆర్వో వినాయకం బదిలీ

నరసరావుపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. జీఏడీలో రిపోర్టు చేయమని వినాయకాన్ని ఆదేశించారు. ఆయన స్థానంలో మురళి డీఆర్‌వోగా నియమితులయ్యారు. ఏపీఎంఎస్ఐడీసీ జీఎంగా పనిచేస్తున్న మురళి పల్నాడుకు బదిలీ అయ్యారు.



డీఆర్వో మురళి

# ఏఎన్‌యూలో ప్రారంభమైన యువజనోత్సవాలు

- విద్యతో పాటు కళలపై కూడాఆసక్తి పెంచుకోవాలి
- వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే గంగాధరరావు



8

# ఊపిరి పీల్చుకోండి

- గుంటూరులో కాలుష్యం కట్టడి
- సాధారణ స్థాయిలోనే శాతాల నమోదు
- మరింతగా తగ్గాలని కోరుకుంటున్న ప్రజలు
- అధిక కాలుష్య నగరాల జాబితా నుంచి బయటకు
- మిగిలిన పట్టణ ప్రాంతాల్లో అందుబాటులో లేని యంత్రాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలతో సరి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నమోదు అవుతున్న వాయి కాలుష్య శాతాలు గుంటూరు నగరవాసులకు ఊరటనిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేపట్టిన కార్యాచరణతో అధిక కాలుష్యం నమోదు అవుతున్న 132 నగరాల జాబితా నుంచి ఉమ్మడి జిల్లా కేంద్రమైన గుంటూరు ఇప్పుడిప్పుడే బయటకు వస్తుంది. శబ్ద, పరిశ్రమ, గృహ కాలుష్యాలు పెద్దగా లేనప్పటికీ వాయు కాలుష్యంతో గతంలో గుంటూరువాసులు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. గతంలో గుంటూరులో వాయు కాలుష్యం 65-68 మైక్రోగ్రామ్స్ క్యూబిక్ క్యూబ్(ఎమ్‌జీక్యూక్యూ) ఉండేది. ఇది సాధారణ స్థాయి అంటే 60 ఎమ్‌జీక్యూక్యూ కంటే చాలా అధికం. ప్రమాదకరస్థాయిలో కాలుష్యం ఉందని కేంద్ర ప్రభుత్వం గుర్తించి చర్యలకు ఉపక్రమించింది. నేషనల్ క్లీనింగ్ ఎయిర్ ప్రోగ్రామ్(ఎన్‌సీఏపీ), నేషనల్ యాబింగ్ ఎయిర్ క్వాలిటీ మానిటిరింగ్(న్యాప్) ద్వారా గుంటూరులో ఎప్పటికప్పుడు కాలుష్య శాతాలను నమోదు చేసుకుని వాటి తగ్గింపు చర్యలకు ప్రణాళికలు రూపొందించింది. ఈ క్రమంలో కొంతమేర వాయు కాలుష్యం తగ్గింది. వాయు కాలుష్య నియంత్రణకు అధికారులు చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు వస్తున్నాయి. నగరంలో వాయు కాలుష్య శాతాలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. ఒకప్పుడు రహదారులు సరిగా లేకపోవడం, వాటి నుంచి వచ్చే దుమ్ము, ధూళి, రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే ఉండటం వంటి కారణాలతో నగరంలో ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యం ఉండేది. 2021 నుంచి నేటి వరకు నమోదు అవుతున్న వాయు కాలుష్య శాతాలను ఈ మధ్యనే కాలుష్య నియంత్రణ మండలి విడుదల చేసింది. వాటిలో సాధారణ శాతాలు నమోదయ్యాయి.

### సమన్వయం లేకపోయినా..

కాలుష్యాన్ని నియంత్రించడానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కార్తికేయ అనే ప్రత్యేక అధికారిని నియమించింది. కానీ ఆశించిన ఫలితాలు రాలేదు. దీనికి శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. సాధారణంగా ప్రతి విభాగానికి ప్రత్యేకశాఖ, యంత్రాంగం ఉంటుంది. కానీ కాలుష్య నివారణకు రవాణాశాఖ, నగరపాలక సంస్థ, పరిశ్రమలశాఖ, కాలుష్య నియంత్రణ, విజిలెన్స్ ఇలా అన్నిశాఖలు కలిసి కార్యచరణ రూపొందించాలి. ఆయా శాఖల మధ్య సమన్వయం లేకపోవడం.. కొన్ని రకాల నిబంధనలు అడ్డురావడం వంటి కారణాలతో కాలుష్య నియంత్రణ పెద్దగా జరగలేదు. దీనికి తోడు 2019లో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కాలుష్య నియంత్రణ అనే ఆలోచన పూర్తిగా అటకెక్కింది. అయినా కొంతమేర కాలుష్యం కట్టడి కావడంపై ప్రజలతో పాటు పర్యావరణవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రత్యేక విభాగం ఏర్పాటు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాలుష్య నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించింది. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసినట్లుగా ప్రత్యేక అధికారిని మళ్లీ నియమించాలని యోచిస్తుంది. నేషనల్ క్లీనింగ్ ఎయిర్ ప్రోగ్రామ్(ఎన్‌సీఏపీ), నేషనల్ యాబింగ్ ఎయిర్ క్వాలిటీ మానిటిరింగ్(న్యాప్) పథకాలను పటిష్టంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. ఎంపీల సహకారంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మున్సిపాలిటీలకు స్వచ్ఛత పథకాలు అమలయ్యేలా కార్యాచరణను ప్రభుత్వం రూపొందిస్తున్నది. అవసరమైతే ఇతర దేశాల్లో ఉన్నట్లుగా కాలుష్య నివారణ చర్యలపై దృష్టి సారించింది. పూర్తి అధికారాలను కేటాయిస్తూ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడానికి ఆలోచన చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### కార్యాలయాలతో సరి..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ఒక్క గుంటూరునగరంలో మినహా మిగిలిన మున్సిపల్ పట్టణాల్లో కాలుష్యాన్ని లెక్కించే యంత్రాలు లేవు. ప్రస్తుతానికి జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్ల పట్టణాల్లో కాలుష్య నియంత్రణ కార్యాలయాల్ని ఏర్పాటు చేశారు. అంతే తప్ప మిగిలిన కార్యకలాపాలను రూపొందించలేదు. కేవలం కాలుష్య నియంత్రణకు సదస్సులను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా ప్రధాన కేంద్రాల్లో అయినా కాలుష్య నమోదు యంత్రాలను ఏర్పాటు చేసి కాలుష్యం శాతాన్ని లెక్కించి కట్టడికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### గాలి ఇలా శుభ్రం..

- 2021-22లో కరోనా కారణంగా వాహనాలు రోడ్లపైకి రాకపోవడంతో కాలుష్యం పూర్తిగా నియంత్రణలో ఉంది.
- గుంటూరు నగరంలో 2023 నుంచి విద్యుత్ వాహనాలు కొనుగోళ్లు పెరిగాయి. నగరంలో ఉన్న వాహనాల్లో దాదాపు 3 శాతం విద్యుత్ వాహనాలే. ఈ కారణంగా కూడా కొంత మేర వాయు కాలుష్యం తగ్గిందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.
- భారీ జరిమానాలకు భయపడి కాలం చెల్లిన వాహనాలను నగరంలో తిప్పడానికి యజమానులు భయపడుతున్నారు. దీంతో వాయి కాలుష్యం నెమ్మదించిందని రవాణాశాఖాధికారులు చెబుతున్నారు.
- మొక్కలు నాటే కార్యక్రమాలు గత కొన్నేళ్లు పెరిగాయి. విద్యార్థులు, స్వచ్ఛందసంస్థలు, ప్రభుత్వం ఉద్యమ తరహాలో మొక్కలు నాటుతున్నాయి. వీటితో పాటు కాలుష్య రహితం కోసం అవగాహన సదస్సులతో కాలుష్యం శాంతించింది.

### 58 శాతానికి తగ్గాలి



గుంటూరులో వాయి కాలుష్యం 58శాతానికి తగ్గాలి. దీనికి అనుగుణంగా నగరపాలక సంస్థ, రవాణా, మైనింగ్ శాఖలతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వాయు కాలుష్యానికి వాహనాలతో పాటు రోడ్లపై వచ్చే దుమ్ము, నూతనంగా భవనాల నిర్మాణ సమయంలో వస్తున్న దుమ్ము మరో కారణంగా భావిస్తున్నాం. భవన నిర్మాణ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం. విజయవాడలో తరహాలో వాయు కాలుష్యాన్ని లెక్కించే యంత్రాన్ని గుంటూరులో ఏర్పాటుకు నగరపాలక సంస్థ అధికారులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతి రాగానే యంత్రాన్ని ఏర్పాటు చేస్తాం. గతంలో శాంపిల్స్‌ను తీసుకుని పరిక్షించి అటుపై శాతాలను నమోదు చేసేవాళ్లం. నూతన యంత్రంతో అప్పటికప్పుడే కాలుష్యాన్ని లెక్కించి, శాతాన్ని వెంటనే తెరపై ప్రదర్శించే ఏర్పాటు చేస్తాం.

**- ఎమ్డీ నజీనాబేగం, పర్యావరణ ఇంజనీరు, గుంటూరు**



సీఎం చంద్రబాబునాయుడు నుంచి చెక్కు అందుకుంటున్న ప్రసాద్ పాండా

విజ్ఞాన్ ఇండస్ట్రియల్ డైరెక్టర్‌కు

## డ్రోన్ హ్యాకథాన్ అవార్డు

గుంటూరు(విద్య),అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇండస్ట్రియల్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న ప్రసాద్ పాండాకు డ్రోన్ హ్యాకథాన్‌లో అవార్డు లభించినట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'అమరావతి డ్రోన్ సమ్మిట్ 24'లో తమ వర్సిటీకు చెందిన ఇండస్ట్రియల్ డైరెక్టర్ ప్రసాద్ పాండాకు డ్రోన్ హ్యాకథాన్‌లో మూడవ బహుమతి అందుకున్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా ఈ అవార్డుతో పాటు రూ.50 వేల నగదు బహుమతిని పొందారని తెలిపారు.

## నలుగురు విద్యుత్ శాఖ ఉద్యోగుల సస్పెన్షన్

కారంపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు గురువారం విద్యుత్ శాఖ మాచర్ల ఈఈ రాంభట్ల తెలిపారు. కారంపూడి మండలంలోని లైన్ ఇన్‌స్పెక్టర్ ఓ.నాగరాజు, అసిస్టెంట్ లైన్‌మెన్ ఎస్.చెన్నకేశవులు, జూనియర్ లైన్‌మెన్ ఎం.పరబ్రహ్మాచారి, షిఫ్ట్ ఆపరేటర్ జి.శ్రీనివాసులు మండలంలోని గాదె వారిపల్లె సబ్‌స్టేషన్‌లో గత శనివారం మద్యం సేవిస్తున్నట్లు సోషల్ మీడియాలో దృశ్యాలు వెలువడ్డాయి. ఈ మేరకు విచారణ జరిపి వారిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఈఈ రాంభట్ల తెలిపారు.

## అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ముప్పాళ్ళ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం తెల్లవారు జామున మండలంలోని మాదలలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలమేరకు మండలంలోని మాదలకు చెందిన ఉగ్గం శ్రీను(43) గత పదేళ్లుగా ఏడు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఏడు ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి సాగు పెట్టుబడి నిమిత్తం రూ.15 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక పశువుల పాక వద్దకు వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య గంగమ్మ మృతిచెందిన భర్త శ్రీనుని చూసి తమ బంధువులకు తెలియ జేసింది. అనంతరం పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలాన్ని వారు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## గ్రాడ్యుయేట్ ఓట్లను చేర్పించండి : మంత్రి అనగాని

రేపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు,కృష్ణా జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపునకు కృషి చేయాలని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో రేపల్లె, నగరం, నిజాంపట్నం,చెరుకుపల్లి మండలాల వారీగా ముఖ్యనేతలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఓటర్లనమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, నియోజకర్గంలోని ప్రతి గ్రామంలో ఉన్న గ్రాడ్యుయేట్ ఓట్లను చేర్పించే బాధ్యత తీసుకోవాలని ముఖ్యనేతలకు సూచించారు. భారీ మెజార్టీతో ఆలపాటిరాజాను గెలిపించే విధంగా నియోజకవర్గంలోని ముఖ్యనేతలు ముందుకు వెళ్ళాలని అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పి.మురళీధరరావు, జి. శ్రీనివాసరావు,ఎం. శివరామకృష్ణ, అనగాని శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్

12 క్రస్ట్ గేట్ల ద్వారా

## పులిచింతలకు నీరు

రెంటచింతల,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 క్రస్ట్ గేట్లకు గాను 12 రేడియల్ క్రస్ట్ గేట్లను 3 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 1,88,220 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కోలేగుండ్ల వెంకటరమణ చెప్పారు.బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.076 ఎంయుల విద్యుదుత్పత్తి చేయగా గురువారం మధ్యాహ్నం నుంచి ఉత్పత్తి ఆపేశామన్నారు.ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.37 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.9910 టీఎంసీల నీటికి సమానమని తెలిపారు.

పులిచింతల

## నీటి సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,15,415 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. పాజెక్టు వద్ద 1,85,855 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నది. వీటిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా, మిగిలినవి ఏడు గేట్ల ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి.

తుమ్మలపాలెం వైసీపీ

## ఎంపీటీసీ రద్దు

ప్రత్తిపాడు, అక్టోబరు 24: తుమ్మలపాలెం వైసీపీ ఎంపీటీసీ మేరుగు సుభాషిణి సభ్యత్వం రద్దు అయింది. తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో చేపట్టిన ఎంపీటీసీ పదవిని రద్దు చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వులను సుభాషిణికి ప్రత్తిపాడు ఎంపీడీవో శివపార్వతి అందజేశారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 133, 142,153 |
| చికెన్ విత్ స్కిన్ | 254.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 264.00 |

## 37,901 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 35,333 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,901 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 24,061 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 8000 | 16000 |
| నెంబరు. 5 | 9000 | 14500 |
| 273 | 12000 | 14000 |
| 341 | 9000 | 15500 |
| 4884 | 11500 | 13500 |
| సూపర్ 10 | 10500 | 12000 |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 8500 | 18500 |
| బ్యాడిగి | 9000 | 15500 |
| దేవనూరు డీలక్స్ | 9500 | 15600 |
| తెల్లకాయలు | 5000 | 11500 |

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| **ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 8200 | 15500 |
| నెంబరు. 5 | 10600 | 13000 |
| 273 | 12000 | 14500 |
| 341 | 9000 | 15500 |
| 4884 | 14000 | 16000 |
| సూపర్ 10 | 10000 | 15500 |
| **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 9000 | 18600 |
| బ్యాడిగి | 9500 | 14500 |
| దేవనూరు డీలక్స్ | 12000 | 14500 |
| తెల్లకాయలు | 5000 | 10500 |

## మహిళల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

- పల్నాడు జిల్లా నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ కె.శ్రీనివాసరావు

నరసరావుపేటలీగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడుజిల్లా నేరసమీక్షా సమావేశాన్ని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కే శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులను హేతబద్ధంగా విశ్లేషించి వాటి సంఖ్యను తగ్గించాలని, పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించే బాధితులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించి సున్నిత మైన భాషలో మాట్లాడాలని అన్నారు. బాధితుల సమస్యలను ఓపిగ్గా వినాలని, న్యాయం జరుగు తుందనే నమ్మకం వారిలో కలిగించాలని సూచించారు. మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసులు, మహిళలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఆస్తి కేసులు, బెట్టింగ్ కేసులు, అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించడం, పాత నేరస్తుల కదలికల పై నిఘా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా కట్టడి చేయడం, ఎమర్జెన్సీ నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, క్రయ, విక్రయాల పై కఠినంగా వ్యవహరించాలన్నారు. నాటుసారా తయారీ, క్రయవిక్రయాల పై నిఘా ఉంచి అరికట్టాలన్నారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఏఎస్పీ సంతోష్, క్రైం అదనపు ఏఎస్పీ లక్ష్మీపతి, నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కే శ్రీనివాసరావు

## వృద్ధ దంపతులపై దాడి కేసులో నిందితుల అరెస్టు

సత్తెనపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో వృద్ధ దంపతుల పై దాడి చేసిన కేసులో నిందితులను గురువారం అరెస్టు చేసినట్టు డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక రంగా కాలనీకి చెందిన సత్తి గవన్ కుమార్‌రెడ్డి పట్టణం పరిసర ప్రాంతాల్లో ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తుంటాడని తెలిపారు. 2024లో జరిగిన ఎన్నికల్లో తన వద్ద రూ 20 లక్షలతో పాటు మరో రూ.20 లక్షలు అప్పు చేసి రూ.40 లక్షలు బెట్టింగ్‌ల్లో పోగొట్టుకున్నాడన్నారు. అప్పులు ఇచ్చిన వారు వెంట పడుతుండటంతో తప్పించుకొని తిరుగుతున్నాడు. ఏదో విధంగా అప్పులు తీర్చాలన్న ఉద్దేశంతో పట్టణానికి చెందిన మర్రి అమ్మయ్యను, మూడవ ముద్దాయి ఐన ఎర్రసాని నానిలను కలుపుకొని ముగ్గురు కలసి ఈ నెల 22వ తేదీ రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న తూనుగుంట్ల సీతారామయ్య ఇంటికి టూ లెట్ బోర్డు పెట్టి ఉండటాన్ని గమనించారు. ముగ్గురు నిందితులు ఆ ఇల్లు అద్దెకు కావాలని సీతారామయ్యను కలిశారు. అతను ఇల్లు చూపిస్తుండగా వృద్ధుడిని బెదిరించడమే కాకుండా ఆయనపై దాడి చేసి డబ్బులు అడిగారు. డబ్బులు లేవని చెప్పిన ఆయనపై మళ్లీ దాడి చేయడంతో, సీతారామయ్య కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి రావడంతో ఆ ముగ్గురూ పారిపోయారు. సీతారామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దర్యాప్తులో భాగంగా గవన్ కుమార్‌రెడ్డి, మర్రి అమ్మయ్యలను పట్టణ పోలీసులు అరెస్టు చేశారన్నారు. నిందితులు ఉపయోగించిన బైక్, కారం పొడిని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ హనుమంతరావు

హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌కి శాశ్వతంగా

## మూడు ఏసీ బోగీలు

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు మీదగా రాకపోకలు సాగించే హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌కి శాశ్వతంగా మూడు ఏసీ బోగీలను జోడిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. నవంబరు 5 నుంచి నంబరు. 17329/17330 హుబ్లీ - విజయవాడ - హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌లకు ఒక ఏసీ టూటైర్, రెండు ఏసీ త్రీటైర్ బోగీలను శాశ్వతంగా జోడిస్తున్నట్లు పేర్కొంది.

దానా తుపానుతో

### మరో మూడు రైళ్లు రద్దు

దానా తుపాను కారణంగా ముందస్తు జాగ్రత్తగా మరో మూడు రైళ్లను రద్దు చేసినట్లు సీపీఆర్‌వో తెలిపారు. ఈ నెల 29న రైలు నంబర్ 03430 -మాల్దాటౌన్ - సికింద్రాబాద్, 27న రైలు నంబర్ 18048- వాస్కోడిగామా - షాలిమార్ అమరావతి ఎక్స్‌ప్రెస్, 25న రైలు నంబరు 18464- భువనేశ్వర్ - కేఎస్‌ఆర్ బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను చేసినట్లు తెలిపారు.

## ఆర్టీసీ విచారణ కేంద్రం ఫోన్ నెంబరు మార్పు

సత్తెనపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఆర్టీసీ డిపో విచారణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ల్యాండ్ లైన్ ఫోన్‌ను రద్దు చేసి సెల్ ఫోన్‌ను ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ విజయకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ప్రయాణీకులు 7382990105 నెంబరకు ఫోన్‌చేసి సమాచారాన్ని తెలుసుకో వచ్చని డీపో మేనేజర్ విజయ కుమార్ తెలిపారు.

## జోన్ డైరీ

● క్రోసూరు మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశు గణన కార్యక్రమం జరుగుతుందని క్రోసూరు పశు వైద్యాధికారి సీహెచ్ మల్లయ్య తెలిపారు. పశు వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పశువుల సమగ్ర సమాచారం సేకరిస్తారని, పశువుల యజమానులు సహకరించాలని ఆయన కోరారు.



బీసీ బాలికల వసతి గృహంలో ఆహారం నాణ్యతను తనిఖీ చేసిన న్యాయాధికారి

### బాలికల వసతి గృహంలో
## న్యాయాధికారుల తనిఖీ

సత్తెనపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రఘు రామ్ నగర్‌లో ఉన్న బీసీ బాలికల వసతి గృహాన్ని గురువారం రాత్రి సత్తెనపల్లి సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. వసతి గృహంలోని పరిసరాలను కూడా ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, పారా లీగల్ వలంటీరు షేక్ సుబాని ఉన్నారు.

## గ్రామ సభకు 65 అర్జీలు

పెదకూరపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జలాలపురంలో రీ సర్వే రెవెన్యూ గ్రామ సభకు 65 మంది రైతులు అర్జీలను తహసీల్దార్ మీసాల డానియేలుకు గురువారం అందించారు. ఈ సందర్భంగా రైతుల భూ సమస్యలకు సంబందించి సత్వర పరిష్కార మార్గాలను చూపటమే రీ సర్వే గ్రామ సభ ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

పెదకూరపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అత్తలూరు ఆప్తాల మిక్ అధికారి పీవీడీ చిన శివ సుబ్బారావు నేత్ర పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా దృష్టి లోపం ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం కంటి పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాకాణి వెంకట రమణ, రాయపూడి సాంబశివరావు, సీహెచ్‌వో అనుపమ, పరిశుద్ద, సుబియ, స్వప్న, ఆరోగ్య కార్యకర్త గుడిపూడి రాణి తదితరులు ఉన్నారు.

## ఆధార్ అప్‌డేషన్ ఉచితం

నకరికల్లు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు 1వ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆదార్ కేంద్రంలో ఐదు నుంచి ఏడు సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాల వారికి బయోమెట్రిక్ అప్‌డేషన్‌ను ఉచితంగా అందించనున్నట్టు పీఎస్ కేఎస్ ప్రసాదు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**దాచేపల్లి(ఆంధ్రజ్యోతి):** మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈక్యాంప్‌లో కొత్తఆధార్, ఆధార్‌కు ఫోన్‌నెంబరు లింక్, 5 నుంచి 17 సంవత్సరాలలోపు పిల్లలకు వేలిముద్రలు అప్‌డేట్ చేయడం, చిరునామాలు మార్చడం, ఆధార్ ప్రింట్ తీయడంవంటి సేవలను అందజేస్తారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుండి 5 గంటల వరకు నిర్వహించనున్నారు.

## మద్యం విక్రేతపై కేసు

పిడుగురాళ్ళ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పోట్లూరి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి 40 క్వార్టర్ల మద్యం సీసాలు కలిగివుండటంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐమోహన్ తెలిపారు. అనధికారికంగా మద్యం విక్రయించినా చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ మోహన్ హెచ్చరించారు.

### రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో
## సత్తాచాటిన శ్యాంప్రకాష్

కారంపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు అనంతపురం జిల్లా హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ - 17 వాలీబాల్ పోటీల్లో తమ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి శ్యాంప్రకాష్ ప్రతిభ చూపినట్లు మండలంలోని పెదకొదమగుండ్ల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సాంబశివరావు తెలిపారు. శ్యాంప్రకాష్ గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి జట్టుకు ద్వితీయస్థానం అందించాడని కొనియాడారు. గురువారం హైస్కూల్లో శ్యాంప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయులు కాలేశ్వరరావును ఉపాధ్యాయులు అభినందించారు.



శ్యాంప్రకాష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

# పత్తి రైతు విలవిల

● ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలు
● పగిలిన కాయలోకి నీరు చేరిక
● కాయ మొలకెత్తి మొక్కలొచ్చిన వైనం
● పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం
● దిక్కుతోచని స్థితిలో రైతులు

ఇటీవల కురిసిన ఎడతెరపి లేని వర్షాలకు పత్తి మొక్కలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రావడం అనుమానమే. కాయ రంగుమారి పత్తి నాణ్యతను ప్రభావితం చేసేలా ఉంది. దీంతో అప్పులు తెచ్చి మరీ సాగు చేసిన రైతులు ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ సీసీఐ కేంద్రాల్లో రంగు మారిన పత్తిని సైతం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



దాచేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలంలో వర్షాదారంగా పంటలు సాగు చేసే గ్రామాలైన తంగెడ, మాదినపాడు, ఎస్ అగ్రహారం, కొత్తూరు, రామాపురం, పొందుగల, శ్రీనివాసపురం, శ్రీనగర్,గామాలపాడు రైతులు జూన్, జూలై మాసాల్లో సుమారు 8 వేల హెక్టార్లలో పత్తి సాగు ప్రారంభించారు. కొందరైతే మేలోనే పత్తి మొక్కలు నాటారు. మొక్కలు కాయ దశకు చేరుకున్న తరుణంలో వర్షం రైతుల ఆశలపై నీళ్లు జల్లింది. పత్తి కాయ పగిలి విచ్చుకున్న సమయంలోనే వర్షాలు కురవడంతో నీరు కాయలోకి చేరింది. దీంతో కాయ కుళ్లిపోవటమో, కాయలోని విత్తనాలు మొలకెత్తడమో అవుతోంది. పగిలిన కాయల్లోని పత్తి నల్లగా మారు తుంది. దీంతో పంట దిగుబడిపై గంపెడాశలు పెట్టుకున్న రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పగిలిన పత్తికాయ నుండి మొలకెత్తిన పత్తి గింజలు

పత్తి గింజల కొనుగోలు, విత్తనాలు విత్తేందుకు అరకలు, వ్యవసాయ కూలీలు, బాడుగలు, ఎరువులు, మందుల ఖర్చు ఎకరాకు సుమారు రూ. 35 వేల నుంచి రూ.40 వేల వరకు అయిందని రైతులు చెబుతున్నారు. ఇంత చేసినా ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడివస్తుంది. నేడు పత్తి క్వింటా మార్కెట్ ధర రూ.5 వేల నుంచి రూ.6 వేలలోపే వుంది. రంగు కోల్పోయి, నాణ్యత తగ్గితే కొనేవారే లేకుండా పోయారు. పెట్టుబడి బాకీలు చెల్లింపు, కుటుంబ పోషణ, అవసరాలు ఎలా తీరుతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే సీసీఐ కేంద్రాల ద్వారా రంగు మారిన పత్తిని సైతం కొనుగోలు చేసేలా చర్యలు తీసు కోవాలని రైతులు కోరుతున్నారు.

**సీసీఐ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి**
**- బొమ్మిరెడ్డి సత్యనారాయణ, రైతు, దాచేపల్లి**



వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటను కొనే దిక్కులేక తీవ్ర అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వమే చొరవ తీసుకొని సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తిని కొనుగోలు చేయాలని కోరుతున్నాం.

**తడిచిన పత్తిని కూడా కొనుగోలు చేయాలి**
**- బొజ్జా చిన అచ్చయ్య, రైతు, శ్రీనివాసపురం**



తడి, పొడి పొత్తిని క్వింటా రూ.8 వేలకు కొనుగోలు చేస్తేనే పెట్టుబడి ఖర్చులైనా వస్తాయి. తడిచిన పత్తిని కొనేందుకు వ్యాపారులు ముందుకు రావటం లేదు. దీంతో ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు.

# ఆక్రమణలు తొలగిస్తాం

● పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్

ఫటా ఫట్



కమిషనర్ పర్వతనేని శ్రీధర్

పిడుగురాళ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో రహదారుల వెంబడి ఆక్రమణలను తొలగించి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో కమిషనర్ 'ఫటాఫట్..'

**ప్ర: రహదారి వెంబడి ఆక్రమణలను తొలగిస్తారా ?**

జ: పట్టణ పరిధిలో రహదారుల వెంబడి ఆక్రమణలు పెరిగాయి. పలువురు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. వాటిని గుర్తించి తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

**ప్ర: సిబ్బంది కొరత వుందా ?**

జ: పురపాలక సంఘ కార్యాలయంలో డీఈ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండగా, ఏఈ, మేనేజర్ పోస్టులు ఖాళీగా వున్నాయి. అదేవిధంగా పారిశుధ్య కార్మికుల కొరత బాగా వుంది. 100 మంది కార్మికులలో రోజుకు 20 మందికి పైగా సెలవు పెట్టడంతో పారిశుధ్యంపై ప్రభావం చూపుతుంది.

**ప్ర: ప్రభుత్వ స్థలాల రక్షణకు చర్యలు చేపడుతున్నారా ?**

జ: మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా తగిన రక్షణ చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటికే ఆక్రమణలో వున్న స్థలాల్లో నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

**ప్ర: ఆస్తిపన్ను వసూళ్లు ఏ విధంగా వున్నాయి ?**

జ: పట్టణ పరిధిలో ఇళ్లస్థలాలు, ఖాళీ స్థలాల పన్ను వసూలు సిబ్బంది ఎప్పటికప్పుడు వసూలు చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరంలో 70 శాతం వసూళ్లు పూర్తయినా 30 శాతం మిగిలిపోతూనే వున్నాయి.



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం తన కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తును పూర్తి చేసి టీడీపీ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు పరిశీలకుడు వీ శ్రీనివాసరావుకు అందించారు. - సత్తెనపల్లి (ఆంధ్రజ్యోతి)

## ఎక్సైజ్ సీఐ చొరవతో మద్యం షాపు మార్పు

సత్తెనపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 19వ నెంబరు మద్యం షాపును అచ్చంపేట రోడ్డులోని కోటమ్మ సత్రం వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మూడురోజుల క్రితం ఆ ప్రాంత మహిళలు గృహాల మధ్య, దేవాలయాల మధ్య షాపు ఏర్పాటు చేయటం తగదని, వెంటనే మార్చాలని కోరుతూ ఆర్యవైశ్య నాయకులు, మహిళలు సీఐ విజయ కుమార్‌కు, డీఎస్పీ హనుమంతరావుకు వినతిపత్రాలు అందించారు. ఆర్యవైశ్య మహిళల, నాయకుల ఆందోళన నేపథ్యంలో పట్టణ ఎక్సైజ్ సీఐ పీ విజయ కుమార్ షాపు నిర్వాహకులతో మాట్లాడి అక్కడ షాపును వేరే చోటకు మార్చుకోవాలని సూచించారు. సీఐ చొరవతో నిర్వాహకులు షాపును వేరే చోటకు మార్చేందుకు అంగీకరించారు. సమస్య పరిష్కారం కావటంతో ఆర్యవైశ్య మహిళలు నాయకులు సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదుపై ప్రచారం

సత్తెనపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ పట్ట భద్రుల ఓట్ల నమోదు ప్రక్రియలో భాగంగా గురువారం టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిశారు. అర్హులైన వారంతా ఓటర్లుగా నమోదు కావాలని కోరారు. ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను వారికి అందించారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ నియోజక వర్గ అధ్యక్షుడు మద్దినేని వెంకట చలపతిరావు,వెంకట కోటయ్య, జయరామ్, రాజు పాల్గొన్నారు.

## కమిషనర్‌కు ఫిర్యాదు

సత్తెనపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 10వ వార్డు వాసవి నగర్ ఆర్చిరోడ్డును కొంత మంది బ్లాక్ చేశారని, విచారించి చర్యలు తీసుకోవాలని ఆ వార్డుకు చెందిన ఉపాధ్యాయుడు షేక్ మాబూ సుభానీ గురువారం కమిషనర్ షమ్మికి ఫిర్యాదు చేశారు. ఈ మార్గంలో మున్సిపాటిలీ 70 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు కూడా వేసిందన్నారు. ఈ రోడ్డు బ్లాక్ చేయటంతో ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ఆయన ఫిర్యాదు చేశారు.

## పోలియో నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

● మండల ఆరోగ్యవిస్తరణ అధికారి శిఖాశ్యామ్‌సన్
● ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవంపై అవగాహన

క్రోసూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలియో నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని క్రోసూరు మండల ఆరోగ్యవిస్తరణ అధికారి శిఖాశ్యామ్‌సన్ అన్నారు. ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవం సందర్భంగా అనంతవరంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో పోలియో నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వాల కృషి, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల కృషి వల్ల పోలియో వ్యాధి తగ్గిపోయిందని ఆయన అన్నారు. అపరిశుభ్ర మైన వాతావరణంలో పెరిగిన పిల్లల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే పోలియో వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పోలియో వ్యాధి లక్షణాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో పలువురు ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.




పిడుగురాళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు, విద్యార్థులు

## పిడుగురాళ్లలో పోలియో నిర్మూలన ర్యాలీ

పిడుగురాళ్ల,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల రోటరీక్లబ్ ఆఫ్ లైమ్‌సిటీ ఆధ్వర్యంలో ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా పిడుగురాళ్ల కేఎస్ఆర్ విద్యాసంస్థలు, కొండమోడు పీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి పోలియో నిర్మూలన గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్ బాబు, గర్రె సుబ్రహ్మణ్యం, నీరుమళ్ల రాజేష్, ఆత్మకూరి గురవయ్య, కాకుమాను శ్రీనివాసరావు, కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రంలో యూటీఎఫ్ నాయకులు

## ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

క్రోసూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట, క్రోసూరు మండలాల స్థాయిలోని క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్ట భద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కే ప్రకాశరావు కేంద్రాన్ని ప్రారంబించిన అనంతరం మాట్లాడుతూ 2021 సెప్టెంబరు 30 లోపు డిగ్రీ పట్టా పొందిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవటానికి అర్హులన్నారు. త్వరలో జరగనున్న గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఇప్పుడు ఓటు పొందిన వారికి ఓటు హక్కు కల్పించట బడుతుందన్నారు. నవంబరు 6వ తేదీ లోగా ఓటరుగా నమోదు కావటానికి అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు 9014422708, 9573855173 నెంబర్లలో సంప్రదించ వచ్చన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బోళ్ళ నరసింహారెడ్డి, కే లక్ష్మణరావు, సీఐటీయూ నాయకులు జీ రవిబాబు, కౌలు రైతు సంఘం నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావు, అగన్ వాడీ యూనియన్ నాయకురాలు శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# డయేరియా మరణాలపై మంత్రుల సమీక్ష

● అధికారులతో ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి, మంత్రి నారాయణ వీడియో కాన్ఫరెన్స్



కాలనీలో బాధితులతో మాట్లాడుతున్న రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సిరి

దాచేపల్లి,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగరపంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో ఇద్దరు వ్యక్తులు వాంతులు, విరోచనాలతో మృతి చెందగా మరో 14 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందడంపై గురువారం పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. డయేరియా లక్షణాలున్న ప్రాంతాలలో తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలని, వైద్యశిబిరాల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు. నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలు జరపాలన్నారు. డయేరియాపై ప్రజలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

అలాగే మంత్రి పొంగూరి నారాయణ కూడా అధికారులతో మాట్లాడారు. కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, డీఎంహెచ్‌వో రవికుమార్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాస్, నగర పంచాయతీ కమిషనర్ అప్పారావులతో సమీక్ష నిర్వహించారు. మృతికి గల కారణాలపై స్పష్టత రాలేదని అధికారులు తెలపడంతో నీటి శాంపిళ్లను విజయవాడ ల్యాబ్‌కు పంపాలని ఆదేశించారు.

**కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తీసుకోండి : కలెక్టర్ అరుణ్‌బాబు**



గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపడుతున్న సిబ్బంది

అంజనాపురం కాలనీలో గురువారం పర్యటించిన కలెక్టర్ అరుణ్‌బాబు కాలనీలో బాధిత కుటుంబ సభ్యులతో, వైద్యఆరోగ్య శాఖ, నగర పంచాయతీ అధికారులతో జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డయేరియా పూర్తి నియంత్రణలోకి వచ్చే వరకు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని గ్రామస్థులకు విజ్ఞప్తిచేశారు. ట్యాంకర్లద్వారా మంచినీటిని సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 14 మంది ఆరోగ్యం గురించి అధికారుల నుంచి సమాచారం సేకరించారు. రాష్ట్ర కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ డాక్టర్ సిరి మాట్లాడుతూ అంజనాపురం కాలనీలో స్థానిక ప్రజలు వాడుతున్న తాగునీటిని శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కి పంపించామని తెలిపారు.

**కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన సీఎం :** డయేరియా మరణాలపై సీఎం చంద్రబాబు స్పందించారు. కలెక్టర్ అరుణ్‌బాబుతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రస్తుతం పరిస్థితి, ప్రభుత్వ పరంగా తీసుకున్న చర్యలను సీఎం కలెక్టర్‌కు వివరించారు. ఆ ప్రాంతంలో సాదారణ స్థితి వచ్చేంత వరకు వైద్యశిబిరాలు నిర్వహిస్తూ నిత్యం పర్యవేక్షించాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు.



మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు

## అర్చక సంఘ నేతల హర్షం

రెంటచింతల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రాహ్మణుల సంక్షేమం కోసం డీడీఎన్ఎస్‌ను రూ.10 వేలకు పెంచడం హర్షణీయమని పల్నాడు జిల్లా అర్చక సేవాసంఘ అధ్యక్షుడు చెంగాళం శేషాచార్యులు అన్నారు.గురువారం విలేకరులతో మాట్లాడుతూ దేవాలయ పాలక మండళ్లలో ఇద్దరు బ్రాహ్మణులకు చోటు కల్పించడం అభినందనీయమన్నారు. బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న దయనీయ స్థితిని గుర్తెరిగిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో అర్చక సేవా సంఘం కార్యదర్శి గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు,వడ్డమాను రమణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

**మాచర్లటౌన్:** దేవాలయాల పాలక మండలిలో తమకు చోటు కల్పించడంపై నాయీ బ్రాహ్మణ సంఘ మాచర్ల పట్టణ నేతలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు రూ. 25 వేల గౌరవ వేతనం ఏర్పాటు చేయడం, సెలూన్ షాపులలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, గత వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన జీవోలను తిరిగి అమలు చేయడం హర్షణీయమన్నారు.సమావేశంలో మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ డీ.ప్రసాదరావు, మాచర్ల హనుమంతురావు, సుబ్బారావు, వెంకట పిచ్చయ్య పాల్గొన్నారు.

## పాఠశాలకు కంప్యూటర్ వితరణ

రెంటచింతల,అక్టోబరు 24: మండలంలోని రెంటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎంఎల్ఆర్ ఫౌండేషన్ తరుపున రూ.40వేలు విలువ చేసే కంప్యూటర్‌ను ఫౌండేషన్ కార్యదర్శి కళ్యాణ్ అందచేసినట్లు ఇన్‌చార్జి హెచ్ఎం సాగరబాబు, బిచ్చిరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ తరపున ఇప్పటి వరకు వివిధ పాఠశాలల్లో 32 కంప్యూటర్లను విద్యార్థులకు అందచేశామన్నారు.

## పీహెచ్‌సీలో రికార్డుల తనిఖీ

దుర్గి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు గురువారం దుర్గికి వచ్చి తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై పలు ఆరోపణలు రావడంతో ప్రత్యేక బృందం వచ్చి తనిఖీ జరిపారు. 2022, 2023, 2024 సంవత్సరాలకు సంబంధించిన రికార్డులను సేకరించారు. రికార్డులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోనున్నారు.తనిఖీలో డీఎంహెచ్‌వో రవి, సూపరింటెండెంట్ సీతారామిరెడ్డి, హరిప్రసాద్, ఏవో నరేష్, రీజనల్ ఆఫీసర్ వెస్లీ పాల్గొన్నారు.

## అద్దెలు త్వరగా చెల్లించాలి

● జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కృష్ణ

గురజాలటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కాంప్లెక్స్ షాపుల అద్దెలు త్వరగా చెల్లించాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్ కాంప్లెక్స్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో షాపుల అద్దెలు చెల్లించాల్సినవారితో సమావేశమయ్యారు. మొత్తం 21షాపుల అద్దె బకాయి రూ.15 లక్షలు పెండింగ్ ఉండగా గురువారం కొంతమేర వసూలు చేసినట్లు సీఈవో కృష్ణ తెలిపారు.సమావేశంలో ఎంపీడీవో గౌసియాబేగం ఉన్నారు.

## ఆహార భద్రతపై శిక్షణ అవసరం

● ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ కలకండ ప్రవీణ్‌కుమార్

మాచర్లటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తప్పనిసరిగా ఆహార భద్రతపై శిక్షణ తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ కలకండ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని వ్యాపారస్తులతో ఆయన సమావేశమయ్యారు. ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించాలన్నారు. రెస్టారెంట్లు, హోటళ్లు, కిరణా దుకాణాలు, బేకరీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కూల్ డ్రింక్స్, సూపర్‌మార్కెట్, కూరగాయలు, చికెన్, మటన్ దుకాణాల వ్యాపారస్థులు ఆహార భద్రతపై శిక్షణా పొందాలన్నారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కర్నూల్, నంద్యాల జిల్లాలతోపాటు మిగతా జిల్లాల్లో కూడా త్వరలోనే ఫుడ్ సేఫ్టీ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్‌ను నియమిస్తామని చెప్పారు. సమావేశంలో వ్యాపారస్థులు పాల్గొన్నారు.

### మెప్మా అర్బన్ మార్కెట్లతో
## డ్వాక్రా మహిళలకు ఉపాధి

మాచర్లటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మెప్మా అర్బన్ మార్కెట్ల ద్వారా డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పిస్తోందని మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. పట్టణంలోని అన్నా క్యాంటీన్ సమీపంలో మెప్మా ఆధ్వర్యాన గురువారం ఏర్పాటుచేసిన అర్బన్ మార్కెట్‌స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయంగా తయారుచేసిన ఉత్పత్తులను అర్బన్ మార్కెట్ల ద్వారా విక్రయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ మార్కెట్‌లో తక్కువ ధరకు పలు రకాల వస్తువులను అందించనున్నట్లు చెప్పారు. నెలలో ఒకట్రెండు రోజులు మాత్రమే వీటిని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సీఈవోలు అంజలి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మితే
## చట్ట ప్రకారం కఠిన చర్యలు

నకరికల్లు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, పురుగు మందులను ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు అమ్మితే సంబంధిత దుకాణదారుడి పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఏవో కే దేవదాసు తెలిపారు. గురువారం నకరికల్లులోని మహితా ట్రేడర్స్, శ్రీ లక్ష్మీ ప్రసన్న ఏజెన్సీస్ దుకాణాలను ఏవో తనిఖీ చేశారు. స్టాక్ నిల్వలను, రిజిస్టర్లను పరిశీలించారు. పురుగు మందుల శ్యాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపారు. విక్రయ రసీదుపై అమ్మకం దారు సంతకంతో పాటు రైతు సంతకం ఉండేలా చూడాలని సూచించారు.

## ఓటు నమోదు చేసుకోవాలి

నకరికల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్ట భద్రులంతా ఓటును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కే పుల్లారావు కోరారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌వోలకు ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ గురించి వివరించారు. ఓటు నమోదుపై పట్ట భద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఈ జీకాశయ్య పాల్గొన్నారు.

**ముప్పాళ్ళ** పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని మండల టీడీపీ బత్తుల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మాదల హైస్కూల్లో ఎమ్మెల్సీ ఓటు నమోదుపై ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి తరుపున పోటీచేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాదుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

## నట్టల నివారణ మందు పంపిణీ

రాజుపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మొక్కపాడు గ్రామంలో సుమారు 1200 గొర్రెలు, మేకలు, పొట్టేళ్లకు పశువైద్యాధికారి కే.నాగేశ్వరరావు నట్టల నివారణ మందు వేశారు. సాధారణంగా జీవాలు భూమికి దగ్గరగా వున్న గడ్డి మేయడం, నిల్వవున్న కుంటలలో నీరు తాగడం, అపరిశుభ్రమైన పాకలు, షెడ్డులలో వుంచడం వల్ల నులిపురుగుల సమస్య కనిపిస్తుందని, ఈ నట్టల వలన జీవాలు తరచూ అనారోగ్యానికి గురవు తాయన్నారు. ఏడాదికి రెండు నుంచి మూడు సార్లు నట్టల నివారణ మందును జీవాలకు వేయించాలని రైతులకు సూచించారు.

# అంతర్గత రహదారులకు మోక్షం

● ఎమ్మెల్యే ప్రవీణ్ చొరవతో రోడ్ల అభివృద్ధికి రూ 11 కోట్లు నిధులు విడుదల

క్రోసూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అంతర్గత రహదారుల నిర్మాణాలకు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ చొరవతో రూ.11 కోట్ల నిధులు విడుదల చేయటం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో పాటు ఇతర నిధులు రూ.11 కోట్లు కేటాయింపులు చేయించారు. అమరావతి మండలం మండెపూడి నుంచి నెమలికల్లు వరకు రూ.2 కోట్ల బీటీ రోడ్డు నిర్మాణానికి కేటాయించారు. మునగోడు నుంచి అత్తలూరు వరకు రూ.2 కోట్లు, గుంటూరు - అమరావతి రహదారిలో ఎనికపాడు బీటీ రహదారికి రూ.కోటి, బెల్లంకొండ మండలం చంద్రాజు పాలెం, పాపాయపాలెం రహదారి నిర్మాణానికి రూ.1.50 కోట్లు, క్రోసూరు మండలం పీసపాడు నుంచి తాళ్యూరు మీదుగా గుడిపాడు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయలు, పెదకూరపాడు మండలం కంభంపాడు నుంచి పరస మీదుగా జలాలపురం వరకు జిల్లా పరిషత్ రహదారికి రూ 1.50 కోట్లు, అంబేద్కర్ బొమ్మ సెంటర్ నుంచి పాల కేంద్రం వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ 50 లక్షలు, మండలకేంద్రం అమరావతిలో మురుగు కాలువల నిర్మాణానికి రూ 50 లక్షలు, వివిధ మండలాల్లోని కొత్తపల్లి, బయ్యవరం, కాశిపాడు, వెంకటాయపాలెం, పాపాయపాలెం గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు రూ.20 లక్షలు, కాలువల నిర్మాణానికి రూ.కోటి కేటాయించారు. ఈ రహదారుల నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

## ఓటుకు 1.25 లక్షల మంది
# పట్టభద్రుల దరఖాస్తు

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. ఈ నెల 23వ తేదీ సాయంత్రానికి లక్షా 25 వేల 59 మంది ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో గుంటూరు జిల్లా నుంచి అత్యధికంగా 29,887, ఎన్టీఆర్ జిల్లాలో 16,155, కృష్ణాలో 14,259, పల్నాడులో 14,715, బాపట్లలో 5,947, ఏలూరులో అత్యల్పంగా 2,997 మంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఓటరు నమోదు షెడ్యూల్ ప్రకారం రెండో రీ పబ్లికేషన్ ఈ నెల 25 విడుదల చేయనున్నారు. నవంబరు 6 వరకు దరఖాస్తులను స్వీకరించి 23న ముసాయిదా ఓటరు జాబితాలను ప్రచురిస్తారు. ఆ రోజు నుంచే క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించడం ప్రారంభిస్తారు. డిసెంబరు 9 వరకు స్వీకరించి వాటిని ఆ నెల 25వ తేదీలోపు పరిష్కరించి 30న తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తారు.

## ఎన్నికలు జరగలేదని..
# ఝలక్

▼ స్థానిక సంస్థలకు నిలిచిన నిధులు
▼ తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం
▼ మూడు మున్సిపాల్టీలు, 69 పంచాయతీలకు ఆగిన నిధులు

(5వ పేజీ తరువాయి)

బాపట్లతో పాటు గుంటూరు జిల్లా పరిధిలోని పొన్నూరు మున్సిపాల్టీలకు ఈ ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఆయా మున్సిపాల్టీలలో పొరుగున ఉన్న పంచాయతీలను విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచారు. ఈ ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని, అధికారం అండతో అధికారులపై ఒత్తిడి తెచ్చి రాజకీయ నేతలు తమకు అనుకూలంగా వార్డుల పునర్విభజన చేయించుకున్నారన్న ఆరోపణలున్నాయి. వీటిని అధికారులు లక్ష్య పెట్టలేదు. దీంతో పలువురు కోర్టును ఆశ్రయించడంతో మున్సిపల్ ఎన్నికలు నిలిచిపోయాయి. నరసరావుపేట మున్సిపాలిటీలో 34 వార్డుల నుంచి 38 వార్డులకు పెంచే క్రమంలో ఇస్సపాలెం, లింగంగుంట్ల, యలమందల, రావిపాడు, కేశానుపల్లి పంచాయతీలను విలీనానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. పొన్నూరు మున్సిపాల్టీలో 31 వార్డులను 36కు పెంచే క్రమంలో చింతలపూడి, కాసుకర్రు, కట్టెంపూడి, ఆలూరు, పెదఇటికంపాడు, వడ్డెముక్కల పంచాయతీలను విలీనం చేశారు. బాపట్ల మున్సిపాల్టీలో అడవి, అడవివారిపాలెం, ఈస్ట్‌బాపట్ల, కొండబొట్లవారిపాలెం, మరుప్రోలువారిపాలెం, ముత్తాయపాలెం, పిన్నిబోయినవారిపాలెం, పోతురాజ కొత్తపాలెం, తూర్పు పిన్నబోయినవారిపాలెం, వెస్ట్ బాపట్ల పంచాయతీలను విలీనం చేశారు. మున్సిపాలిటీల్లో ఆయా పంచాయతీల విలీనం వల్ల నష్టం వాటిల్లుతుందని భావించిన కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఆయా పంచాయతీలతో పాటు మున్సిపాల్టీకి ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. చిలకలూరిపేట మున్సిపాల్టీలో విలీనమైన దండమూడి పంచాయతీకి ఎన్నికలు జరగలేదు. గుంటూరుకార్పొరేషన్, మంగళగిరి, తాడేపల్లి, క్యాపిటల్ సిటీలో విలీనం చేసిన పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు.

### రూ.కోట్లలో నిలిచిన నిధులు

2022-23 ఆర్థిక సంవత్సరం మున్సిపాల్టీలకు ఆర్థిక సంఘం నిధులు సమకూరాయి. రెండో విడత కింద నరసరావుపేటకు రూ.3.79 కోట్లు, బాపట్లకి 3.16 కోట్లు, పొన్నూరు మున్సిపాల్టీకి 1.96 కోట్లు నిధులు విడుదలయ్యాయి. మూడో విడత కూడా అదే స్థాయిలో నిధులు విడుదల కావాల్సి ఉంది. అయితే ఎన్నికలు జరగని కారణంగా నరసరావుపేట రూ.3.79 కోట్లు, బాపట్ల రూ.3.16 కోట్లు, పొన్నూరు మున్సిపాల్టీకి 1.96 కోట్లు ఆగిపోయాయి. ఈ నిధులు సమకూరి ఉంటే ఆయా పట్టణాల్లో చాలావరకు రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు అవకాశం ఉండేది. ఎన్నికలు నిర్వహించకపోవడం మున్సిపాల్టీల ఆర్థిక అవకాశాలను దెబ్బతీసింది.

# చీరకట్టే ఫ్యాషన్



ఇంట్లో శుభకార్యం, కాలేజీలో వీడ్కోలు పార్టీ స్నేహితురాలి పుట్టినరోజు.. ఇలా ఏ వేడుక ఉన్నా ఈతరం అమ్మాయిలు ముందుగా ఆలోచించేది, ఏ డ్రస్ వేసుకుంటే బాగుంటుంది అనే. అందుకు నేటి తరం యువతులు ఫ్యాషన్ దుస్తులపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. జీన్స్, టీషర్ట్, లెగ్గిన్స్, జెగ్గిన్స్, లంగా ఓణీ, చుడీదార్ వంటి ఫ్యాషన్ డ్రెస్సులతో పాటు, నేటి యువతులు చీరకట్టు వైపు కూడా మక్కువ చూపుతున్నారు.

**జీన్స్‌పై యువత అనాసక్తి**
**చీరకట్టు వైపు మొగ్గు**
**వేడుక ఏదైనా చీరతోనే అందం**

తెనాలి,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చీరకట్టుతో అందరినీ కట్టిపారేయాలనుకుంటున్నారు నేటి తరం అమ్మాయిలు. అయితే చీరకట్టులో అందంగా కనిపించాలంటే మాత్రం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. లేని పక్షంలో ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. కొందరికి చీరకట్టుకోవాలన్న కోరిక బలంగా ఉంటుంది. అయితే చీర కట్టు మాత్రం వారికి అస్సలు నప్పదు. ఇలా కట్టుకుని ఇబ్బందులు పడేకంటే ఎవరికి ఎ లాంటి చీర బాగా కనిపిస్తుందో తెలుసుకుని మరీ ట్రెండ్ ను ఫాలో అయితే బాగుంటుంది. అయితే చీర ఎంపిక చేసుకునేటప్పుడు శరీరాకృతి, రంగును దృష్టిలో పెట్టుకుంటే కనికట్టు చేయొచ్చు అంటున్నారు కొందరు ఫ్యాషన్ నిపుణులు.

### ఎత్తు ఎక్కువగా ఉన్నవారు

ఎత్తుగా ఉన్న వాళ్లు చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే చాలు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తారు. బ్రొకెట్ మెరుపులతో తీర్చిదిద్దినవి, హుందా పనితీరుతో రూపొందించిన సిల్క్, కాటన్, కాంజీవరం, టిష్యూ, ఎంబ్రాయిడరీ చీరలు కట్టుకుంటే చక్కగా కనిపిస్తారు. సింథటిక్ వస్త్రాలపై పెద్దపూలు, బొమ్మల ప్రింట్లు ఉన్నవి కట్టుకుంటే వీరికి బాగా నప్పుతాయి.

### ఎత్తు తక్కువగా ఉన్నవారు..

ఎత్తు తక్కువగా ఉన్న యువతులు కూడా చీరలు కట్టుకోవడం అంటే మహా ఆనంద పడతారు. వాళ్లు మాత్రం అంచుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిజైన్స్ చిన్నవిగా ఉండి, అంచు సన్నగా ఉండే చీరలను ఎంపిక చేసుకోవాలి. దీంతో పాటు లేత రంగులో ఉండే చీరలను తీసుకుంటే మరింత అందంగా కనిపిస్తారు. ప్రస్తుతం మార్కెట్ లో గాగ్రాలాగా కుట్టి వేసుకోవడానికి సిద్ధంగా ఉన్న చీరలు మార్కెట్‌లో ఉన్నాయి. చీరకట్టుకోవడం రాని వాళ్లు, సమయం వృథా కాకుడదనుకు నే వారు మాత్రమే ఇలాంటి వాటిని ఎంచుకుంటున్నారు.

### సన్నని నడుము ఉన్నవారు

కొందరు సన్నగా ఉన్నా నడుము భాగం, పొట్ట లావుగా ఉంటుంది. ఇలాంటి వారు చీరను మామూలుగా కట్టుకున్నా ఇంకా లావుగా కనిపించే ఆస్కారం ఉంటుంది. అలాంటప్పుడు చీరకు కుచ్చిళ్లు పోయకుండా గాగ్రా చోళీ తరహాలో కట్టుకుంటే వీరికి నప్పుతుంది. ఇలాంటి చిన్న చిన్న చిట్కాలు పాటించి మీరు చీరకట్టులో అందంగా కనిపించవచ్చని ఫ్యాషన్ నిపుణులు పేర్కొన్నారు.

### ఫెయిర్ శరీరాకృతి ఉన్నవారు

వీరికి చీరలు మా బాగా నప్పుతాయి. చీరకట్టుకుంటే వీరు బాగా అందంగా కనిపిస్తారు. ఫియర్ శరీరాకృతిలో ఉన్న యువతులకు షిఫాన్ చీరలు వారి అందాన్ని ద్విగుణీకృతం చేస్తాయి. వర్క్ ఎక్కువగా ఉండే సిల్క్, కాటన్ చీరలకు వీరు కాస్త దూరంగా ఉంటే మంచిది. చీరలపై వర్క్ విషయంలో చూస్తే చిన్న అద్దాలు, చమ్కీలు పొదిగినవి వీరికి బాగా నప్పుతాయని నిపుణులు పేర్కొన్నారు. అయితే వీరు కుచ్చిళ్లు అధికంగా ఉండేలా చూసుకోవాలి.





### భుజాలు పెద్దవిగా ఉన్నవారు

కొందరి శరీరాకృతిలో భుజాలు పెద్దవిగా ఉంటాయి. ఇలాంటి వారు మాత్రం ధరించే బ్లౌజు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. మెడ బ్లౌజ్ భాగం చిన్నగా ఉండేలా కుట్టించుకోవాలి. చేతులు ఎంత తక్కువగా పెట్టించుకుంటే అంత మంచిది. పైట చెంగు కుచ్చిళ్ల వెడల్పు తక్కువ గా ఉండేలా చూసుకోవాలి. ఇ వి పెద్దగా ఉంటే భుజాలు మ రింత వెడల్పుగా కనిపిస్తాయి.

### లావుగా ఉండేవారు

లావుగా ఉండే వాళ్లు చీరకట్టుకోవడానికి ఎక్కువగా ఇష్టపడరు. అయితే వీరు కాటన్ చీరల వైపు కన్నెత్తి చూడకూడదు. కాటన్ చీరలే కట్టుకోవాలంటే మాత్రం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్యాబ్రిక్, నూలు కలగలసిన వాటికి ప్రాధాన్య మివ్వాలి. సన్నగా కనిపించాలంటే మాత్రం జార్జెట్, షిఫాన్, క్రేప్, ఇటాలియన్ వంటి వాటిని ఎంచుకుంటే మంచిది. పొట్ట ఎక్కు వగా ఉన్నవారు పట్టుచీర కట్టుకునే సమయంలో కుచ్చిళ్లు తక్కువగా ఉండేలా చూసుకోవాలి.

## విభజిత జిల్లాలకు.. నూతన డీఈవోలు

- గుంటూరుకు సీవీ రేణుక, పల్నాడుకు చంద్రకళ
- బాపట్ల డీఈవోగా ఎస్ పురుషోత్తం
- డైట్ ప్రిన్సిపల్ బదిలీ
- గుంటూరు ప్రస్తుత డీఈవో శైలజకు పోస్టింగ్ నిల్
- కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు

గుంటూరు(విద్య),అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) గుంటూరు విభజిత జిల్లాలకు కొత్త విద్యాశాఖ అధికారుల్ని నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా డీఈవోగా కమిషనరేట్‌లో పనిచేస్తున్న సీవీ రేణుకను నియమించారు. పల్నాడు డీఎస్ఈవోగా(జిల్లా పాఠశాలల విద్యాశాఖాధికారి) విశాఖగా డీఈవోగా పనిచేస్తున్న ఎల్ చంద్రకళను నియమించారు. ఈమెకు బోయపాలెంలోని డైట్ (జిల్లా శిక్షణా కేంద్రం)ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు. అదే విధంగా మదనపల్లె డిప్యూటీ డీఈఈవోగా పనిచేస్తున్న ఎస్ పురుషోత్తం బాపట్ల డీఎస్ఈవోగాను బదిలీ చేశారు. డైట్ బోయపాలెం ప్రిన్సిపల్ సలీమ్ బాషాను కృష్ణాజిల్లా అంగలూరు డైట్ ప్రిన్సిపల్‌గా నియమించారు. డైట్ బోయపాలెంలో పనిచేస్తున్న సీనియర్ అధ్యాపకుడు అత్తోట కిరణ్‌కుమార్‌ను ప్రకాశం జిల్లా డీఈవోగా బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

### గుంటూరు ప్రస్తుత డీఈవోకు పోస్టింగ్ నిల్

గుంటూరు జిల్లాలో డీఈవోగా ఇప్పటి వరకు పనిచేసిన పి శైలజకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.దీనిపై ఉ పాధ్యాయల వర్గా ల్లో తీవ్ర చర్చసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి అను కూలంగా పనిచేశారనే ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా ఉమ్మడి జిల్లాలో ఎయిడెడ్ పోస్టుల భర్తీ విషయంలో భారీ ఆరోపణలు వచ్చాయి. పోస్టుల భర్తీ వివాదాస్పదం కావడంతోపాటు భారీ మొత్తంలో చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. పది ఫలితాల్లో వెనుకబడి పోవడం, పాఠశాలల పర్యవేక్షణ తూతూ మంత్రంగా చేయడం, ఓ డిప్యూటీ డిఇవోపై భారీస్థాయిలో ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు కలెక్టర్ బంగ్లాపక్కనే ఉన్న ఎంఈవో కార్యాలయంలో ఇద్దరు ఎంఈవోల మధ్యనెలకొన్న వివాదం చాంబర్‌కు తాళాలు వేసేస్థాయికి వెళ్ళింది. పనుల కోసం వచ్చిన ఉపాధ్యాయులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడినా పట్టించుకోకుండా ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఉపాధ్యాయ సంఘాల విషయంలో అనుసరించినవైఖరిపై వారిలో తీవ్ర అసహనం ఉంది. ఓ సామాజిక వర్గానికి కొమ్ముకాసే విధంగా ప్రవర్తించడం, విద్యాశాఖ నుంచి ఏ సమాచారం అడిగినా స్పందించక పోవడం వంటి అనేక కారణాలతో ఆమెకు పోస్టింగ్ ఇవ్వలేదని చెబుతున్నారు. మరోవైపు ఆమె పదోన్నతుల జాబితాలోఉన్నందున పోస్టింగ్ ఇవ్వలేదని విద్యాశాఖ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.



సీవీ రేణుక (గుంటూరు డీఈవో)



ఎల్ చంద్రకళ (డీఎస్ఈవో)పల్నాడు

## బస్టాండ్‌లో జోనల్ ఈడీ తనిఖీలు

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు గురువారం ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టాల్స్‌లో ధరల పట్టికలను పరిశీలించారు. ఎమ్మార్పీకి మించి విక్రయాలు జరిపితే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బస్సుల రాకపోకల్లో సమయ పాలన పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం తిక్కన సమావేశ మందిరంలో గుంటూరు-1, 2, పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల మేనేజర్లతో సమీక్షించారు.కార్తీక మాసంలో భక్తులకు శైవక్షేత్రాలకు సకాలంలో బస్సులు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతిభ చూపిన పలువురు డ్రైవర్లకు ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధి కారి ఎం రవికాంత్, డిపో మేనేజర్లు అబ్దుల్ సలాం, రామకృష్ణ తదితరులున్నారు.



సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఈడీవెంకటేశ్వరరావు




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య గంగాధరరావు

**ఏఎన్‌యూలో ప్రారంభమైన యువజనోత్సవాలు**
**విద్యతో పాటు కళలపై కూడా ఆసక్తి పెంచుకోవాలి.**
**వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే గంగాధరరావు**



# యువజనోత్సాహం

పెదకాకాని(ఏఎన్‌యూ), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా 2024-2025 యువజన ఉత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. యువజనోత్సవాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్ ఆడిటోరియంలో ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపకులపతి ఆచార్య కె. గంగాధరరావు మాట్లాడుతూ విద్యతోపాటు అదనంగా క్రీడలు, కళా రంగాలపై విద్యార్థులు దృష్టి సారించినట్లయితే పరిపూర్ణ జీవితాన్ని పొందగలుగుతారని పేర్కొన్నారు. కళా రంగంలో ప్రతిభ ఉన్నవారికి అనేక రకాల విజయాలు సొంతమవుతాయని సూచించారు. వ్యక్తిగత రంగంతో పాటు సమష్టిగా రాణిస్తే ఆయా రంగాలలో విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. అటువంటి విజయాలు సమాజాన్ని మేల్కొలిపేలా ఉంటాయని సూచించారు. ఈ యువజన ఉత్సవాల వేడుక విద్యార్థుల్లో దాగివున్న కళానైపుణ్యతను ప్రదర్శించేందుకు అవకాశం గా భావించి విద్యార్థులు ప్రదర్శనలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడుగా పాల్గొన్న థియేటర్, సినీ ఆర్టిస్టు, పారిశ్రామికవేత్త డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు మాట్లాడుతూ భావితరాలకు నేటి విద్యార్థులు పునాది రాళ్ల వంటి వారన్నారు. రేపటి జీవనరంగం నేటి యువతతో నిండివుందన్నారు. విద్యార్థులు ఒక స్పార్క్ మాదిరిగా వెలుగులు వెదజల్లాలని పిలుపునిచ్చారు. రెక్టార్ ఆచార్య కే రత్న షీలామణి మాట్లాడుతూ విద్యార్థులు మూడు రోజుల ఈ ఉత్సవాలలో సాంస్కృతిక, సాహిత్య, కళ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు వేదికగా నిలుపుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ కళా నైపుణ్యంతో విద్యార్థులు ప్రదర్శన లు ఇవ్వాలన్నారు. యువజనోత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీ మోహన్ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో 30 కళాశాల నుంచి విద్యార్థులు ఈ యువజన ఉత్సవాలలో పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కోఆర్డినేటర్ ఆచార్య పి .జాన్సన్, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సిద్దయ్య, ఆచార్య ప్రమీలా రాణి, ఆచార్య ఎస్ వి కృష్ణారావు, ఆచార్య ధ నలక్ష్మి, ఆచార్య ఈ మాధవి, ఆచార్య త్రిమూర్తి రావు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పోటా పోటీగా పలు ప్రదర్శనలు.

మ్యూజిక్, థియేటర్ ఆర్ట్స్ పోటీలలో విద్యార్థులు పోటీపడి మరీ వారి ప్రదర్శనలు ఇచ్చారు. ముఖ్యంగా క్లాసికల్ డాన్స్‌లో అలనాటి మేటి చిత్రాల్లో ప్రముఖ నర్తకీమణులు నృత్యం చేసిన పాటలకు నేటి యువత అడుగులు వేయడం చూపరులను ఆకట్టుకుంది. తొలిరోజు గురువారం యువజన ఉత్సవాలలో భాగంగా క్లాసికల్ ఇనుస్ట్రుమెంటల్ సోలో, ఫోక్ ఆర్కెస్ట్రా, వెస్ట్రన్ లోకల్ సోలో, వెస్ట్రన్ గ్రూప్ సాంగ్ లలో విద్యార్థులు మంచి ప్రదర్శనలు ఇచ్చారు. పోస్టర్ మేకింగ్, స్పాట్ పెయింటింగ్ లో విద్యార్థులు సృజనాత్మకతను వెలిబుచ్చారు. వికాస భవన్, విద్యార్థి కేంద్రం, దక్షిణామూర్తి సెమినార్ హాల్, బాలమోహన్ దాస్ సెమినార్ హాల్, ఓపెన్ ఎయిర్ థియేటర్ విభాగాలలో జరిగిన ఆయా పోటీలలో ఉత్సాహవంతమైన ప్రదర్శనలు ఇచ్చారని యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ తెలిపారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన



## మిర్చియార్డులో మళ్లీ
# విజిలెన్స్ తనిఖీలు

**గేట్ ఎంట్రీ మొదలు ఎగ్జిట్ వరకు పరిశీలన**
**స్వయంగా రంగంలోకి ఎస్పీ. సిబ్బందికి ముచ్చెమటలు**

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చియార్డులో మళ్లీ విజిలెన్స్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణకుమార్, సీఐలు కొమ్మాలపాటి చంద్రశేఖర్, పీ శివాజీ తమ బృందంతో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మిర్చియార్డుకు చేరుకుని పరిశీలించారు. యార్డులోకి మిర్చి టిక్కీల రాక మొదలు ట్రేడింగ్ ఎలా జరుగుతుంది, ఈనామ్‌లో బిడ్డింగ్, ట్రేడింగ్ తర్వాత సరుకు బయటకు ఎలా వెళుతుంది, విక్రయం కాని వాటిని కోల్డ్‌స్టోరేజ్‌లకు తరలించేటప్పుడు ఏ నిబంధనలు పాటిస్తారు వంటి వాటిని ప్రత్యేకంగా తెలుసుకున్నారు. ఈనామ్ బిడ్డింగ్ సెంటర్‌కు వెళ్లి ఎక్స్‌పోర్టర్లు ఏ విధంగా వేలంలో పాల్గొంటారనేది తనిఖీ చేశారు. బిడ్డింగ్ అయిపోయిన తర్వాత కమీషన్ వ్యాపారి దుకాణంలో మిర్చి టిక్కీలు కాటా వేయడాన్ని పరిశీలించారు. మిర్చి యార్డు ముఖద్వారం నుంచి సరుకు బయటకు వెళ్లేటప్పుడు రిజిష్టర్‌లో ఏ వివరాలు నమోదు చేస్తారని రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం చిలకలూరిపేట రోడ్డులో ఉన్న కోల్డ్‌స్టోరేజ్‌ను కూడా సందర్శించి అక్కడ మిర్చి టిక్కీలు ఎలా నిల్వ చేస్తారు, బాండ్లు ఎవరి పేర్లతో జారీ చేస్తారు, యార్డుకు రాకుండా కోల్డ్‌స్టోరేజ్‌లోనే జరిగే విక్రయాల గురించి ఆరా తీశారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు విజిలెన్స్ డైరెక్టర్ జనరల్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు నెలల క్రితం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి కొన్ని ఆధారాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికను సిద్ధం చేశారు. అప్పటి ఎస్పీ, సీఐలు, తహసీల్దారు బదిలీఅయి కొత్త అధికారులు వచ్చారు. ఆ ఫైలు గురించి అధ్యయనం చేసిన ప్రస్తుత అధికారులు క్షేత్రపరి శీలనకు గురువారం మిర్చియార్డుని సందర్శించారు. యార్డు ఇన్‌చార్జి శ్రీకాంత్ ద్వారా వివరాలు సేకరించారు. కమీషన్ ఏజెంట్ లైసెన్సుల గురించి తెలుసుకున్నారు. ఈనామ్‌లో తక్కువగా బిడ్డింగ్ జరుగుతుండంపై ఆరా తీశారు. విజిలెన్స్ అధికారులు ముందస్తుగానే యార్డు అధికారులకు తాము తనిఖీలకు వస్తున్నామని సమాచారం ఇచ్చారు. ఏ ఒక్కరూ బయట కు వెళ్లొద్దని చెప్పడంతో సిబ్బందికి ముచ్చెమటలు పట్టాయి.



మిర్చియార్డులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ, సీఐలు

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

## ఈపూరు మండలంలో సామాజిక తనిఖీ గ్రామ సభలు

ఈపూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలూరు, బోడెపూడివారి పాలెం, భద్రుపాలెం, బొమ్మరాజుపల్లి, ఈపూరు గ్రామాలలో గురువారం సామాజిక తనిఖీల గ్రామ సభలు జరిగాయి. పనులకు రానివారికి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు మస్టర్లు వేసినట్లు గుర్తించామని డీఆర్పీలు సభలో చదివి విన్పించారు. ఎస్ఆర్‌పీ రాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం యొక్క ప్రయోజనాలను తెలియజేశారు.

### చిలకలూరిపేటలో పారిశుధ్యం మెరుగుపరచాలి: కమిషనర్ శ్రీహరిరావు

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ శ్రీహరిరావు శానిటరీ అధికారులకు, సిబ్బందికి సూచించారు. గురువారం మునిసిపల్ సమావేశ మందిరంలో పారిశుధ్య పనులు, ట్రేడ్ లైసెన్స్, హాజరు అంశాలపై శానిటేషన్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజు ఉదయమే కార్మికులు, ఇన్‌స్పెక్టర్లు వీధుల్లో తిరుగుతూ పారిశుధ్య పనులను పరిశీలించాలని ఆదేశించారు. వందశాతం ఇంటింటికి వెళ్ళి తడిపొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమణారావు, సునీత పాల్గొన్నారు.

### ఎంఏఎం ఫార్మసీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



తూనుగుంట్ల భవాని రమేష్ కుమార్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తున్న తూనుగుంట్ల భవాని రమేష్ కుమార్ ఫార్మాస్యూటికల్ సైన్స్‌స్ విభాగంలో మధ్యప్రదేశ్ సత్య సాయి యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్స్‌స్ నుంచి డాక్టరేట్ డిగ్రీ పొందారని చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు గురువారం తెలిపారు. డయాబెటిస్ మెలిటస్ వ్యాధి తీవ్రత, దుష్ఫలితాలు చికిత్స విధానాలపై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. భవాని రమేష్ కుమార్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

### తేళ్లకు ఎంపీ లావు పరామర్శ

చిలకలూరిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక టింబర్ వ్యాపారి, చిలకలూరిపేట విద్యా సంఘం అధ్యక్షుడు, శ్రీశైలం కాకతీయ కమ్మ సత్రం సంఘం అధ్యక్షుడు తేళ్ళ సుబ్బారావు నరసరావుపేట సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయన స్థానిక కొమ్మినేని వీరశంకరరావు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈ సందర్భంగా తేళ్ళ సుబ్బారావును నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు గురువారం పరామర్శించారు. పలువురు పట్టణ ప్రముఖులు కూడా ఆయనను పరామర్శించారు.

### వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీవాసవి సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీవాసవి జ్ఞాన మందిరంలో గురువారం అమ్మవారి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొత్త కోటేశ్వరరావుతో పాటు కార్యదర్శి కొప్పురావూరి కుమార్, కోశాధికారి గ్రంధి సుబ్బారావు, సహాయ కార్యదర్శి పొట్టి శ్రీనివాసరావు, చిలకల రామలింగేశ్వరరావు, నాగేశ్వరరావు, పటేల్, నాగేంద్ర, సూర్యం, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

### ఉన్నవలో రెవెన్యూ గ్రామసభ

యడ్లపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉన్నవ గ్రామంలో గురువారం అధికారులు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై 41 అర్జీలు అధికారులకు అందాయి. తహసీల్దార్ విజయశ్రీ అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ అనూరాధ, మండల సర్వేయర్ సురేంద్ర, విలేజ్ సర్వేయర్ స్వాతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

### నలగార్లపాడులో 13 దరఖాస్తులు

రొంపిచర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నలగార్లపాడులో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ నిర్మల, రెవెన్యూ శాఖ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భూ సమస్యలపై 13 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ తెలిపారు.

### గొరజవోలులో 45 అర్జీలు

నాదెండ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరిజవోలులో గురువారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. 45 అర్జీలను గ్రామస్థులు అందజేశారు. సభలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.ధనలక్ష్మి, సర్వేయర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### పిచికలపాలెంలో...

పిచికలపాలెం (శావల్యాపురం) అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలోని తప్పుల సవరణల కోసం రైతులంతా దరఖాస్తులు చేసుకోవాలని ఎఫ్ఏసీ తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు అన్నారు. మండలంలోని పిచికలపాలెంలో బుధవారం రీసర్వే గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ గణపర్తి బుల్లబ్బాయి, రీసర్వే డీటీ నాసరయ్య, వీఆర్వోలు, రవి, రాధ, నరసింగరావు, విలేజ్ సర్వేయర్ రవి, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట శివారు కేఎస్‌పీ కాలనీ ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడు హరిక్రిష్ణపై డీఈవో ఎం వెంకటేశ్వర్లును కలిసి నరసరావుపేట టీడీపీ, జనసేన శ్రేణులు ఫిర్యాదు చేశారు. హరికృష్ణ విధులకు హాజరుకాకుండా రెస్టారెంట్ నడుపుతున్నట్లు టీడీపీ. జనసేన వర్గీలయు ఫిర్యాదులో పేర్కొన్నారు. హరికృష్ణపై విచారణకు డీఈవో వెంకటేశ్వర్లు విచారణకు ఆదేశించారు.

## అధ్వానంగా రహదారులు

● ఇక్కట్లు పడుతున్న వాహన చోదకులు
● గోతుల రోడ్లపై తరచూ ప్రమాదాలు



గోతులమయంగా ఉన్న ఐనవోలు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు

నూజెండ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని రహదారులు గుంతలమయంగా మారిపోయాయి. ముఖ్యంగా వినుకొండ - కురిచేడు మార్గంలో ఐనవోలు గ్రామంలో పొలాలకు వెళ్లే నీరు ఆర్‌అండ్‌బీ రోడ్డు పైకి చేరుతుండటంతో రోడ్లు కోతకు గురై గుంతలమయంగా మారాయి. భారీ వాహనాలు ప్రయాణించటంతో చిన్న చిన్న గుంతలు కూడా మరమ్మతులు చేయకపోవటంతో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా వినుకొండ నూజెండ్ల ఉల్లగల్లు మార్గంలో కూడా నూజెండ్ల, రవ్వవరం గ్రామాల్లో కూడా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. తరచూ రోడ్డు ప్రమాదాలకు ఈ గుంతలే కారణమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

### ప్రమాదకరంగా నరసరావుపేట - ముప్పాళ్ళ రహదారి

రొంపిచర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ ముప్పాళ్ళ నుంచి నరసరావుపేట వెళ్ళే రహదారి ప్రమాదకరంగా మారింది. నెలలో ఏదో ఒక ప్రమాదం సంభవిస్తోంది. రొంపిచర్ల హైవే, అన్నవరం, బుచ్చిపాపన్నపాలెం గ్రామాల సమీపంలో ప్రమాదాలు జరిగి పలువురు గాయపడి, మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి. ఈ రహదారిలో ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల బస్సులు అధికంగా తిరుగుతున్నాయి. మితిమీరిన వేగంతో వెళ్తుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రొంపిచర్ల ప్రధాన రహదారిలో అధికవేగంతో వాహనాలు ప్రయాణిస్తున్నాయి. గతంలో అన్నవరం, చప్టాపై ప్రమాదాలు సంభవించి గోగులపాడుకు చెందిన వ్యక్తి మృతిచెందాడు. అదేవిధంగా ఈ నెల 21వ తేదీన బుచ్చిపాపన్నపాలెంలో బస్సు ఢీకొని ఆరేపల్లి గ్రామానికి చెందిన బత్తుల శివ మృతిచెందాడు. పోలీసులు వేగంగా వెళ్లే వాహనచోదకులపై కఠినంగా వ్యవహరించకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

### చెక్కవాగు బిడ్జిపై వర్షం నీరు

వినుకొండ, అక్టోబరు 24: (ఆంధ్రజ్యోతి) మార్కాపురం రోడ్డులోని చెక్కవాగుపై నిర్మించిన బిడ్జి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బిడ్జిపై వర్షం నీరు నిల్వ ఉండడంతో వాహనదారులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. గతంలో బిడ్జికి ఏర్పాటు చేసిన రైలింగ్ పలుచోట్ల దెబ్బతింది. వాహనదారులు నీరు నిలచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నేళ్లుగా ఆర్‌అండ్‌బీ గ్యాంగ్‌మెన్‌లు, జాతీయ రహదారుల శాఖ అధికారులు, ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ కాలక్షేపం చేయటంతో బిడ్జిపై చెత్త పేరుకుపోయింది. దీంతో వర్షంనీరు కిందకు ప్రవహించే రంధ్రాలు పూర్తిగా మూసుకుపోయి ప్రమాదాలకు నిలయంగా మారింది. అధికారులు బిడ్జిపై పేరుకుపోయిన చెత్తను తొలగించి, వాహన ప్రమాదాలను అరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### ప్రమాదాలకు అడ్డాగా వినుకొండ- అద్దంకి ప్రధాన రహదారి

వినుకొండ, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 24: మండలంలోని గోనుగుంట్లపాలెం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. వైసీపీ పాలనలో కనీసం రోడ్డుపై గుంతలు పూడ్చిన దాఖలాలు లేకపోవడంతె వర్షం తాకిడికి చెరువును తలపిస్తోంది. నీటి తాకిడికి గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. గ్రామంలోని పాఠశాల సమీపంలో 40 అడుగుల రోడ్డు, నేడు కనీసం మూడు అడుగులు కనిపించకపోవడంతో స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డును పరిశీలించి గుంతలు పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.





చెక్కవాగు బిడ్జిపై నిలిచిఉన్న వర్షం నీరు, గొనుగుంట్లపాలెం వద్ద తారురోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన నీరు

## గోదావరి జలాలను తరలిస్తే భూములు సస్యశ్యామలం

● ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు



సభలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

నూజెండ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సాగునీరు అందక, వర్షాభావ పరిస్థితుల్లో పంటల సాగుకు ఇబ్బందులు పడుతున్న రైతుల సాగు నీటి సమస్యల పరిష్కారానికి గోదావరి జలాలను కుడి కాలువకు తరలించటం వల్ల ఈ ప్రాంత భూములు సస్యశ్యామలమవుతాయని ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు అన్నారు. బుధవారం మండలంలోని పువ్వాడ గ్రామంలో గుండ్లకమ్మ నదిపై బ్రిడ్జి నిర్మాణం, శంకుస్థాపన, జల జీవన్ మిషన్ పథకం ప్రారంబోత్సవం, ములకలూరు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాల్లో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్‌తో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొని మాట్లాడుతూ తాగు నీటికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతి ఇంటికి మంచి నీరు అందించే విధంగా ప్రారంభించిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో ప్రతి కుటుంబం వంద రోజులు పని కల్పించేలా అధికారులు పనిచేయాలన్నారు. వరికపుడిసెల నిర్మాణానికి అటవీ భూముల సమస్య పరిష్కారమైందని, త్వరితగతిన ఈ ప్రాజెక్టును నిర్మించటం ద్వారా వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలానికి తాగు, సాగు నీటి సమస్య పరిష్కార మవుతుందన్నారు.

### రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పాలన: ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

రైతుల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పువ్వాడలో జరిగిన సభలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్‌తో మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌తో కలసి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందిస్తున్నామన్నారు. గోదావరి - పెన్నానదుల అనుసంధానం ద్వారా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నూజెండ్ల మండలానికి రూ.113 కోట్లతో గుండ్లకమ్మ నదిపై ఆరు ఎత్తిపోతల పథకాలు మంజూరయ్యాయన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందిస్తామన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేయనున్నామన్నారు. గత ప్రభుత్వం కుటిల బుద్ధితో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు గ్రామ అభివృద్ధికి చేసిన పనుల బిల్లులను నిలిపివేసిందని, వారి కష్టనష్టాలను ప్రభుత్వం బిల్లులు చెల్లించేలా చూడాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాల ప్రారంబోత్సవాలు, శంకు స్థాపనలకు వచ్చిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు ప్రజలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన ఉమ్మడి జిల్లా కన్వీనర్ నిశ్శంకరావు శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు యార్లగడ్డ లెనిన్‌కుమార్, జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రాములు, మేడం రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణ యాదవ్, టీడీపీ నాయకులు లగడపాటి వెంకటరావు, షమీమ్‌ఖాన్, మాదినేని ఆంజనేయులు, వంకాయలపాటి పేరయ్య, కాకాణి వీరాంజనేయులు, గంగినేని ఆంజనేయులు, సోమేపల్లి బ్రహ్మయ్య, అనుమోలు సుబ్బారెడ్డి, కాకాణి హరిబాబు, కుంటా కోటిరెడ్డి, ఎరబిక్కి వెంకటరావు, రామాంజనేయులు, కుంటా కృష్ణారెడ్డి, భైరపనేని శ్రీనివాసరావు, నంబుల గురునాథరావు, గోరంట్ల సాంబశివరావు, జిల్లెలమూడి శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎస్.సిద్ధ లింగమూర్తి, తదితర అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


### పోలీసుల కోసం వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా గురువారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పల్నాడు జిల్లా ఎస్పీ కే.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో భాగంగా పోలీసులు ఎన్నో ఒడిదుడుకులకు గురవుతారన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పోలీసు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మెడికల్ క్యాంపులో మ్యాక్సివిజన్‌కు చెందిన డాక్టర్ చెంచిరెడ్డి, రాఘవేంద్ర మల్టీస్పెషాలిటీ వైద్యశాల నిర్వాహకులు భార్గవ్, శ్రీదత్తా సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ కృష్ణకాంత్, మహేష్‌లు శిబిరంలో పాల్గొన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ సంతోష్, ఏఆర్‌డీ ఎస్పీ మహాత్మా గాంధీ, ఆర్ఐ గోపీనాథ్, యువరాజ్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ట్రై సైకిల్ పంపిణీ



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మూడు చక్రాల సైకిల్ పంపిణీ చేసిన సభ్యులు

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ పండరీపురం ఆధ్వర్యంలో వరల్డ్ పోలియో డే ని పురస్కరించుకొని చౌదరయ్య స్కూల్ విద్యార్థులు, మోడరన్ స్కూల్ విద్యార్థులు పట్టణ పురవీధుల్లో ప్రజల్లో అవగాహన కల్పించటం కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో దివ్యాంగునికి రోటరీ సభ్యులు లంకా రఘు రామిరెడ్డి సహకారంతో మూడు చక్రాల సైకిల్ బహూకరించారు.

### మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న కార్మికులకు స్కిల్, సెమీస్కిల్, అన్‌స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు శిలార్ మసూద్ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ కార్మికుల మచ్చర్ పాయింట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శిలార్ మసూద్ మాట్లాడుతూ వారాంతపు సెలవులు, పండగ సెలవులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు షేక్ చిన్న అలాభక్షు, కార్యదర్శి సోమశేఖర్, కుంచాల శ్రీను, బాలాజీసింగ్, బత్తుల శ్రీను, షకీలా శ్రీను, రంగనాయకులు, గూడా సామ్రాజ్యం, పీ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

### నూరుశాతం ఫలితాల సాధించాలి: డీవీఈవో నీలావతిదేవి

యడ్లపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో నూరుశాతం ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులు కృషిచేయాలని పల్నాడు జిల్లా వొకేషనల్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి అన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ప్లస్‌టూ)ను ఎం.నీలావతిదేవి గురువారం సందర్శించారు. ముందుగా మొదటి, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించి మెరుగైన ఫలితాల సాధనకు తీసుకోవలసిన చర్యల గురించి చర్చించారు. అదనపు తరగతులు నిర్వహించడం, అంతర్గత పరీక్షలపై దృష్టి పెట్టాలని సూచించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రాక్టికల్స్ చేసుకునేందుకు గణపవరంలోని సీఆర్ కళాశాల లేదా చిలకలూరిపేటలోని ఏఎంజి కళాశాలలోకాని అవకాశం కల్పిస్తామన్నారు. పాఠశాల హెచ్ఎం విజయభారతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### పేటీఎం ద్వారా రుణాల చెల్లింపులు: చిన్నబుల్లెయ్య

శావల్యాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల రుణాల చెల్లింపుల్లో ఎటువంటి వ్యత్యాసాలకు తావులేకుండా ఉండేందుకు ప్రభుత్వం పేటీఎం విధానాన్ని ప్రవేశపెట్టిందని శ్రీనిధి జిల్లా అసిస్టెంట్ మేనేజర్ రంతు చిన్నబుల్లెయ్య అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మూడు గ్రామాల్లోని వీవోఏలకు ప్రభుత్వం నూతనంగా అందించిన పేటీఎం మిషన్‌లను ఏపీఎం చేతులమీదుగా గురువారం అందజేశారు. ఏపీఎం మాట్లాడుతూ మండలంలోని 15గ్రామపంచాయతీల్లో ఇప్పటికే 10 పేటీఎంమిషన్‌లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు, సీసీలు ఖాజా, కరుణమ్మ, మేరీకుమారి తదితరులు పాల్గొన్నారు.

### నట్టల నివారణతో జీవాలకు వ్యాధినిరోధకశక్తి: కాంతారావు

శావల్యాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నట్టల నివారణతో గొర్రెలు, మేకలలో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని జిల్లా పశువర్ధకశాఖాధికారి డాక్టర్ కాంతారావు అన్నారు. శావల్యాపురం పశువైద్యశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువైద్యశాల రికార్డులు, పశువులకు అందిస్తున్న వైద్యసేవలు, పశుపోషకులకు ప్రభుత్వమందిస్తున్న రాయితీ, పథకాల అమలు తీరు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం కనమర్లపూడి, కొత్తలూరు, శానంపూడి గ్రామాల్లోని రైతుసేవాకేంద్రాలను సందర్శించి సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పశుగణన కార్యక్రమం ప్రారంభం కానుందని, పశుగణన ద్వారానే ప్రభుత్వం పశుపోషకులకు పథకాలు, రాయితీలను పంపిణీ చేస్తుందన్నారు. పశు వైద్యాధికారులు సోమల గుణధీర్, పాలపర్తి గణేష్‌కుమార్, యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్లు అబ్రహాం, బలరాం, మేఘన పాల్గొన్నారు.

### వాగ్దేవి డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు 21మంది చెన్నైకు చెందిన టెక్ మహేంద్ర కంపెనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కే.రాజేంద్రప్రసాదు గురువారం తెలిపారు. కంపెనీ హెచ్ఆర్ ఎస్.రాజప్ప మూడు రౌండ్స్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూలలో గ్రూప్ డిస్కషన్, జేఏఎం, హెచ్ఆర్ రౌండ్స్ ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఐటీ సపోర్ట్ ఉద్యోగాలకు ముగ్గురు, అసోసియేట్ కస్టమర్ సపోర్టు ఉద్యోగాలకు 18మంది ఎంపియ్యారు. శిక్షణ అనంతరం ఐటీ సపోర్టు ఉద్యోగాలకు రూ.3.20లక్షలు, అసోసియేట్ కస్టమర్ సపోర్టు ఉద్యోగాలకు రూ.2.20 లక్షల వార్షిక వేతనం ఉంటుందన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలసి చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న నాతాని వెంకటేశ్వర్లు, కే నాసరయ్య తదితరులు

### సీఎం సహాయ నిధికి రూ.5లక్షల విరాళం

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది, యాజమాన్యం రూ.5లక్షల విరాళం సేకరించారు. ఈ విరాళాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో కళాశాల డైరెక్టర్ కే.నాసరయ్య, ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశామని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు.



చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, వనమా శివ తదితరులు

### రూ.1.80 లక్షలు విరాళం

సీఎం సహాయనిధికి రూ 1.80 లక్షలు విరాళంగా నరసరావుపేటకు చెందినవారు గురువారం అందజేశారు. వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతులు మీదగా సీఎంకు అందజేశారు. అవుదానం నాగేశ్వరరావు రూ.లక్ష, యలమంద విద్యార్థులు రూ.80,200లు కలిపి మొత్తం రూ.1,80,200లు చెక్కు అందజేసినట్లు వనమా శివ గురువారం తెలిపారు. కార్యక్రమంలో వేల్పుల సింహాద్రియాదవ్, వనమా సాంబశివరావు, దేసు శ్రీనివాసరావు, అవుదానం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన జట్టు సభ్యులతో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, పీడీ ఈదర ఆదిబాబు తదితరులు

### కబడ్డీ విజేత కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాల పురుషుల కబడ్డీ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచిందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు పలకలూరు విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో జరిగిన పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. అనంతరం విశ్వవిద్యాలయం పురుషుల కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. జట్టుకు బీ నాగఫణీంద్ర, జె అంకాలు, బీ అజయ్‌కుమార్, బీ విజయ్‌కుమార్ ఎంపిక అయ్యారన్నారు. ఈ నెల 30 నుంచి నవంబరు 3వరకు తమిళనాడు ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో జరగబోయే సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విజేతగా నిలిచిన జట్టు సభ్యులను డైరెక్టర్ కే నాసరయ్య, వైఎస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, ఎం.తిరుపతిరావు, అహ్మద్ తదితరులు అభినందించారు.

### సౌత్‌జోన్ బాస్కెట్ బాల్ పోటీలకు ధనలక్ష్మీ కళాశాల విద్యార్థి



గన్నేపల్లి చినబాబు

ఈపూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మీ కళాశాల ఎంపీడీ విద్యార్థి గన్నేపల్లి చినబాబు సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చుండు వెంకట్రావు గురువారం తెలిపారు. అంతర విశ్వవిద్యాలయాలకు జరిగే పోటీలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తరుపున బెంగులూరులోని క్రిస్ట్ యూనివర్శిటీలో జరిగే సౌత్‌జోన్ బాస్కెట్ బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా చిన్నబాబును కళాశాల కరస్పాండెంట్ అండ్ డైరెక్టర్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు బలరాం నాయక్, దాసు, అరవింద్, వంశీలు అభినందించారు.

### వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సొలస (యడ్లపాడు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మండలంలోని సొలస గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి, గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చీఫ్ విజిలెన్స్ అధికారి ఈదర రాంబాబు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ అవగాన వారోత్సవాలు-2024లో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. గుంటూరుకు చెందిన శ్రీకృష్ణ హాస్పిటల్స్‌కి చెందిన గుండె వైద్యులు, మాక్సివిజన్ హాస్పిటల్‌కి చెందిన కంటి వైద్యులు శిబిరంలో పాల్గొని వైద్యసేవలు అందించారు. సుమారు 250మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి విజయ్‌కుమార్, బ్యాంకు పల్నాడు ప్రాంతీయ మేనేజరు శ్రీనివాస్, చీఫ్ మేనేజర్ రామబ్రహ్మం, కో-ఆర్డినేటర్ జగదీష్, సొలస మేనేజర్ కొండపాటి ప్రణీత్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంతో ఖర్చులు ఆదా : డీపీఎం అమలకుమారి

కొండవీడు (యడ్లపాడు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేయడం వలన తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని డీపీఎం అమలకుమారి అన్నారు. గురువారం మండలంలోని కోట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పత్తి పొలాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి సేద్య విధానంలో సాగుచేసిన పత్తిపంట ఎంతో ఆరోగ్యంగా ఉందన్నారు. అంతేగాకుండా అంతర పంటలు వేసుకోవడం వలన పంటకు చీడపీడల నుంచి రక్షణ లభించడమే కాకుండా అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఘన జీవామృతం వాడడం వలన రసాయన ఎరువుల వాడకం తగ్గి భూసారం పరిరక్షించబడుతుందన్నారు. దీనితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఫారుఖ్, తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

### ఆజాద్ నగర్ వాసులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి

● పల్నాడు సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్

వినుకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని ఆజాద్ నగర్ వాసులకు విద్యుత్ సౌకర్యంతో పాటు, మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు స్థానిక ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు నివాసంలో పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీ వరప్రసాద్ కలిసి గురువారం వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఆజాద్ నగర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు ప్రజలు సుమారు 5వేల మంది కూలి పనులతో జీవనం సాగిస్తున్నారని, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆజాద్‌నగర్ ప్రజలకు మునిసిపాలిటీ తాగునీరు, విద్యుత్ సౌకర్యం నిలిపివేయటంతో ప్రజలకు కనీసం తాగడానికి నీరులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా నగర్‌వాసులకు విద్యుత్ సౌకర్యంతో పాటు, మౌలిక వసతులు కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో నియోజకవర్గం కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, సీపీఐ నాయకులు వెంకటేశ్వర్లు, రాయవరం వందనం, కొప్పురపు మల్లికార్జునరావు, షేక్ మస్తాన్, షేక్ కరీం, దూపాటి మార్కుతో పాటు ఆజాద్ నగర్ వాసులు పాల్గొన్నారు.